శనివారం
28-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 216
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

వెనిజులా, క్యూబా సోదర దేశాలు

వెనిజులా, క్యూబా సోదర దేశాలని, తమది విడదీయరాని బంధమని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో అన్నారు. చరిత్రాత్మక-విప్లవాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కానెల్‌తో భేటీలో నిర్ణయించినట్లు చెప్పారు.

2లో

అహోబిలం మఠం కేసు

ఏపీ సర్కార్‌కు చుక్కెదురు

- నిర్వహణ బాధ్యత ధర్మకర్తలదేనని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- మఠాన్ని ఎందుకు చేజిక్కించుకోవాలనుకుంటున్నారని ప్రశ్న

న్యూఢిల్లీ : అహోబిలం మఠం కేసులో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. మఠం సాధారణ కార్యకలాపాలతో ప్రభుత్వానికి ఏమి సంబంధమని, మఠాన్ని ఎందుకు చేజిక్కించు కోవాలనుకుంటున్నారని ప్రశ్నించింది. ఆలయాలు, ధార్మిక క్షేత్రాలను ధర్మకర్తలకే వదిలి వేయాలని... అందులో జోక్యం చేసుకోవద్దని ఆదేశించింది. అహోబిలం మఠానికి కార్యనిర్వాహక అధికారిని నియమించే అధికారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి లేదన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాన్ని వ్యతిరేకిస్తూ దాఖలయిన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆలయాన్ని నిర్వహణను 'ధర్మకర్తలకే వదిలేయాలి' అని శుక్రవారం పేర్కొంది. 'అహోబిల మఠం పరంపర ఆధీన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం' (అహోబిలం మఠం దేవాలయం) కార్యనిర్వాహక అధికారిని నియమించేందుకు చట్ట ప్రకారం ఆంధ్ర ప్రదేశ్‌కు ఎలాంటి అధికారం, అధికార పరిధి లేదా హక్కు లేదని న్యాయమూర్తులు ఎస్.కె.కౌల్, ఎ.ఎస్.ఓకాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 'ధర్మకర్తలను దీనిని నిర్వహించనివ్వండి. ఆర్టికల్ 136 (సుప్రీంకోర్టు ద్వారా అప్పీల్ చేయడానికి ప్రత్యేక అనుమతి) కింద ప్రతి సందర్భంలోనూ మేము చట్టాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నించాల్సిన

- మిగతా 2 లో

ఒక్కరోజులో రూ.48 వేల కోట్లు ఆవిరి

- స్టాక్ మార్కెట్‌లోనూ పతనం
- భారీగా పడిపోయిన అదానీ సంపద
- కుబేరుల జాబితాలో ర్యాంకు కిందకు...

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సంపద క్షీణించింది. ప్రపంచ కుబేరుల జాబితాలో టాప్ 10లో ఉన్నవారిలో ఆదానీ సంపద మాత్రమే ఈ ఏడాది తగ్గింది. దీంతో కుబేరుల జాబితాలో మూడవ స్థానంలో ఉన్న ఆయన ప్రస్తుతం ఏడవ స్థానానికి పడిపోయారు. అదానీ సంపద... స్టాక్ మార్కెట్‌లో మరింత పతనమైంది. బుధవారం ఒక్కరోజే 5.9 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.48 వేలకోట్లకుపైనే నష్టపోయారు. అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల పరిశోధన సంస్థ 'హిండెన్‌బర్గ్' నివేదిక ద్వారా ఈ విషయం వెలుగుచూసింది. అదానీ గ్రూప్‌లోని ఏడు లిస్టెడ్ కంపెనీల స్టాక్స్, బాండ్లు మూడు నుంచి ఏడుశాతం నష్టపోయాయి. ప్రస్తుతం అదానీ వ్యక్తిగత సంపద 113 బిలియన్ డాలర్లు. అదానీ గ్రూప్ షేర్లలో అవకతవకలు, అకౌంట్స్‌లోనూ మోసాలు చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. పర్యవసానంగా అదానీ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. రుణాల వల్ల అదానీ గ్రూప్ ఆర్థిక అనిశ్చితిలోకి జారుకుంటున్నట్లు హిండెన్‌బర్గ్ పేర్కొంది. కాగా, అదానీ ఎంటర్‌ప్రైజెస్ శుక్రవారం రూ.20వేల కోట్ల గ్రూప్ ఫాలో అన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో) వద్ద ప్రారంభించింది. అదానీ పోర్ట్స్ షేర్ విలువ 16శాతం పడిపోగా అదానీ

- మిగతా 2 లో

సినీనటి జమున కన్నుమూత

- అనారోగ్యంతో ఇంటివద్ద మృతి
- ప్రజానాట్యమండలిలో అధ్యక్ష వర్గ సభ్యురాలిగా ఎనలేని సేవ
- రాజకీయాల్లోనూ తనదైన ముద్ర
- రాజమండ్రి ఎంపీగా ఎన్నిక

2లో

అలనాటి సినీనటి జమున(86) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. అశ్రు నయనాల మధ్య జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జమున అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆమె కూతురు స్రవంతి దహన సంస్కారాలు నిర్వహించారు.

జమున మృతదేహంపై ప్రజానాట్యమండలి పతాకాన్ని కప్పి నివాళులర్పిస్తున్న రామకృష్ణ తదితరులు

అరకొర వేతనాలు

- పీఎఫ్, ఈఎస్ఐకి 90 శాతం మంది దూరం
- దినసరి కూలీ అంతంత మాత్రమే
- నిర్మాణరంగంలో లోపించిన పారదర్శకత
- ప్రాజెక్ట్ హీరో నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకెళు తోందని, అన్ని రంగాల్లో వృద్ధి భారీగా నమోదవుతోందని కేంద్రప్రభుత్వం ఇష్టానుసారం ప్రచారం చేసుకుంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. దేశంలో కార్మికులు అరకొర వసతులతో శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఆశ్చర్యమేమంటే 90 శాతం మంది కార్మికులకు కనీస వేతనం లభించడం లేదు. 87 శాతం మందికి బీమా, ఈఎస్ఐ సదుపాయం లేదు. నిర్మాణ రంగంలోని కార్మికులు, కాంట్రాక్టర్ల పరిస్థితుల ఆధారంగా యాప్ ఆధారిత సంస్థ 'ప్రాజెక్ట్ హీరో' విడుదల చేసిన నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. తమ యాప్‌లో నమోదయ్యే దరఖాస్తులు, ప్రకటించే పోస్టులకు సంబంధించిన సమాచారం ఆధారంగా తాజా నివేదికను వెలువరించినట్లు సంస్థ తెలిపింది. నిర్మాణ రంగంలో 10శాతం

- మిగతా 2 లో

విపక్షాల భేటీ కోసం ఎదురుచూస్తున్నా

- లోక్‌సభ ఎన్నికలపై వ్యూహం రూపొందిస్తాం
- బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకం చేస్తాం
- బీహార్ సీఎం నితీశ్‌కుమార్

పాట్నా: వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి భావసారూప్యత గల పార్టీల సమావేశం కోసం వేచిచూస్తున్నానని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ శుక్రవారం చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర పూర్తయితే విపక్ష పార్టీల సమావేశం ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. భారత్ జోడో యాత్రను కాంగ్రెస్ పార్టీ అంతర్గత కార్యక్రమంగా చూస్తున్నానని, అయితే మహా కూటమి భాగస్వామ్య పార్టీలన్నీ లోక్‌సభ ఎన్నికల్లో కలిసే ముందుకు నడుస్తాయని నితీశ్ చెప్పారు. పార్టీ బలహీనంగా ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన జేడీయూ పార్లమెంటరీ బోర్డు అధ్యక్షుడు ఉపేంద్ర కుశ్వాహాపై చర్యలు తీసుకోబోమని, అయితే, ఆయన చెప్పినట్లు పార్టీ బలహీనంగా లేదని ముఖ్యమంత్రి వివరించారు. 'భారత్ జోడో యాత్ర పూర్తికావడం కోసం నేను ఎదురుచూస్తున్నాను. దాని తర్వాత బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ సమావేశం కావాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల కోసం మేము వ్యూహం రూపొందించుకుంటాం' అని నితీశ్ విలేకరులకు చెప్పారు. తన పార్టీ చీలికకు కుట్ర చేస్తుందని బీజేపీపై ఆరోపణలు చేస్తూ జేడీయూ గతేడాది ఆగస్టులో ఎన్‌డీఏ నుంచి బయటికి వచ్చిన విషయం విదితమే. కుశ్వాహా గురించి అడిగిన ప్రశ్నకు జేడీయూ నేత నితీశ్ స్పందిస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో తాము 43 సీట్లు మాత్రమే గెలిచినట్లు ఆయనకు తెలుసని, ఒకవేళ పార్టీ అంతకన్నా బలహీనపడినట్లు భావిస్తే కుశ్వాహా తిరిగి పార్టీలో చేరేవారు కాదని చెప్పారు. వాస్తవంగా కుశ్వాహాను పార్టీలోకి తీసుకోవడానికి చాలామంది నాయకులు అంగీకరించలేదని, తానే అందరినీ ఒప్పించి

- మిగతా 2 లో

దిల్లీ వర్సిటీలో ఉద్రిక్తత

- మోదీ బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ఏర్పాట్లు... అడ్డుకున్న అధికారులు
- పోలీసుల అదుపులో 24 మంది విద్యార్థులు

2లో

ప్రధాని మోదీపై వివాదాస్పద బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శన నేపథ్యంలో దిల్లీ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో సెక్షన్ 144 విధించారు. పెద్ద సంఖ్యలో గుమిగూడిన విద్యార్థులను పోలీసులు చెదరగొట్టారు.

పాదయాత్రలో అపశ్రుతి తారకరత్నకు గుండెపోటు

3లో

మూడేళ్లలో ఏం చేశారు?

- డ్యాన్స్‌లేసి, క్యాసినోలాడిస్తే పరిశ్రమలు రావు
- జగన్ అంటే జాదూనే గుర్తొస్తున్నాడు
- యువతకు టీడీపీ ప్రత్యేక మేనిఫెస్టో
- యువగళాన్ని, వారాహిని ఆపలేరు
- పాదయాత్ర సభలో నారా లోకేశ్

విశాలాంధ్ర -కుప్పం: యువగళం పేరు ప్రకటించగానే వైసీపీ నాయకులకు వణుకు పుట్టిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. నాలుగు వేల కిలోమీటర్లు చేపట్టనున్న యువగళం పాదయాత్రను శుక్రవారం ఉదయం కుప్పం నుంచి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ 'యువగళం పాదయాత్ర ప్రకటించగానే 10మంది మంత్రులు నాపై మాటల దాడికి దిగారు. ఏ అర్హతతో పాదయాత్ర చేస్తున్నావని ప్రశ్నించారు. గతంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా అభివృద్ధి చేశాను. ఐటీ మంత్రిగా, వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాను. ఆ అర్హతతోనే పాదయాత్ర చేస్తున్నా. నన్ను విమర్శించే మంత్రులను ప్రశ్నిస్తున్నా.. ఈ మూడేళ్లలో మీరు ఈ రాష్ట్రానికి ఏం చేశారు, వీధుల్లో డ్యాన్సులు వేస్తే, క్యాసినో ఆడిస్తేనో పరిశ్రమలురావు. పొట్టి శ్రీరాములు త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. దేశంలోనే తెలుగు జాతి గర్వ పడేవిధంగా ఎన్టీఆర్‌కృషి చేశారు. ఆంధ్రుల సత్తా ఏంటో చంద్రబాబు చేసి చూపించారు. కానీ, ఒక్క ఛాన్స్ ఇస్తే జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారు. ఈ మూడేళ్లలో వైసీపీ చేసిందేమిటి? జగన్ అంటే జాదూ గుర్తొస్తున్నాడు. మైసూర్ బోండాలో మైసూర్ ఉండదు.. జాదూరెడ్డి జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాలు ఉండవు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఇస్తామన్నారు.. ఏమయ్యాయి ఉద్యోగాలన్నీ? ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు ఏమైంది? మెగా డీఎస్సీ ఏమైందని జగన్‌ను ప్రశ్నిస్తున్నా. దిల్లీ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామని చెప్పిన జగన్, దిల్లీలో తెలుగువారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు. దానికి కారణం ఆయనపైన ఉన్న కేసులే. యువత, రైతులు.. ఇలా అన్ని వర్గాలు ఈ ప్రభుత్వం బాధితులే. ఈ మూడేళ్లలో రాష్ట్రాన్ని 67ఏళ్ల వెనక్కి తీసుకెళ్లారు. మూడు రాజధానుల్లో ఎక్కడైనా ఒక్క ఇటుకైనా వేశారా జగన్? పారిశ్రామిక వేత్తలు పక్క రాష్ట్రాలకు పారిపోయే పరిస్థితి. జే ట్యాక్స్ కట్టలేదని పక్క రాష్ట్రానికి పంపించేశారు. మహిళలపై దాడులు జరిగితే గన్ కంటే ముందు జగన్ వస్తాడని ప్రగల్భాలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం

- మార్చి 1 నుంచి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు
- అదే రోజు నుంచి ప్రజాప్రతినిధుల ఆస్పత్రుల సందర్శన
- పిల్లలకు వారానికి మూడుసార్లు రాగిమాల్ట్ పంపిణీ
- వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. మార్చి 1న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పూర్తిస్థాయిలో ప్రారంభించాలని, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఆస్పత్రుల సందర్శన అదే రోజు నుంచి ఉండాలని సీఎం చెప్పారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖపై శుక్రవారం సీఎం సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి విలేజ్ క్లినిక్‌కు నెలలో రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ వెళతారని అధికారులు తెలిపారు. జనాభా 4వేలు దాటి ఉంటే మూడోసారి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ

- మిగతా 2 లో

భద్రతా సిబ్బంది గైర్హాజరు ఆగిన 'భారత్ జోడో యాత్ర'

- పోలీసు సిబ్బంది ఎక్కడా కనిపించలేదు : రాహుల్
- ఇది పెద్ద భద్రతా లోపం : జైరాం రమేశ్

ఖానాబల్ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అధ్వర్యంలో కొనసాగుతున్న 'భారత్ జోడో యాత్ర' శుక్రవారం జమ్ముకశ్మీర్‌లో తాత్కాలికంగా నిలిచిపోయింది. జమ్ముకశ్మీర్ పాలనా యంత్రాంగం ద్వారా పోలీసు ఏర్పాట్లు 'దురదృష్టవశాత్తు పూర్తిగా కుప్పకూలినందున' ఈరోజు తన పాదయాత్రను రద్దు చేసుకోవలసి

- మిగతా 2 లో

మూడేళ్లలో ఏం చేశారు?

(మొదటిపేజీ తరువాయి)

పలికారు. కానీ, అది బుల్లెట్లు లేని గన్ అని ప్రజలకు అర్థమైంది" అని లోకేశ్ విమర్శించారు.

భయం నా బయోడేటాలోనే లేదు: లోకేశ్

"యువతకు హామీ ఇస్తున్నా.. త్వరలోనే యువతకు ప్రత్యేకంగా మేనిఫెస్టో తీసుకు రాబోతున్నాం. ప్రభుత్వ ఉద్యోగాలు ఎన్ని? ప్రైవేటు రంగం నుంచి ఎన్ని? స్వయం ఉపాధి ద్వారా ఎన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామో స్పష్టంగా అందులో ప్రకటిస్తాం. ఏటా డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తాం. కౌలు రైతులకు ప్రత్యేక కార్యాచరణ తీసుకొచ్చి ఆదుకుంటాం. ప్రభుత్వ వైఫల్యాలను విమర్శిస్తే.. నాకు చీరలు, గాజులు పంపుతామని ఓ మహిళా మంత్రి అన్నారు. పంపించండి చీర, గాజులు.. మా అక్కలు, చెల్లెల్లకు ఇస్తా. చీర కట్టుకుని గాజులు వేసుకునే వాళ్లు చేతగానివాళ్లా? అని అడుగుతున్నా. మీ జగన్ మాదిరిగా తల్లీ, చెల్లిని బయటకు గెంటలేదు. మంత్రి పదవిలో ఉన్న వాళ్లు ఎలా మాట్లాడాలో నేర్చుకోవాలి. ఏ1 తెచ్చిన జీవో1తో అడ్డుకోవాలని చూస్తారా? పవన్ కల్యాణ్ పోరాటాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారు. పవన్ వారాహి వాహనానికి ఆంక్షలు పెడుతున్నారు. యువగళం ఆగదు, వారాహి ఆగదు. భయం నా బయోడేటాలోనే లేదు. అడ్డొస్తే తొక్కుకుని వెళ్లి పోతాం. మంచి కోసం పోరాడే ధైర్యం ఉంది. సైకో పాలనలో అప్పులు.. ఆత్మహత్యలు. సైకిల్ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి. 400 రోజుల పాదయాత్రలో ఇది తొలిరోజు. నిరుద్యోగ యువతకు పిలుపినిస్తున్నా.. కలిసికట్టుగా ఉద్యమించి జగన్‌ను ఇంటికి పంపిద్దాం" అని లోకేశ్ అన్నారు.

కుప్పంలో ఘనస్వాగతం

తొలిరోజు పాదయాత్రకు జనం పోటెత్తారు. తమ ఆత్మబంధువు, చంద్రన్న బిడ్డ లోకేశ్ చారిత్రాత్మక యాత్రలో భాగంగా తమ వద్దకు వస్తున్న సమయంలో కుప్పం ప్రజలు ఆనందంతో కేరింతలు కొడుతూ జై చంద్రన్న, జై లోకేశ్ నినాదాలతో హోరెత్తించారు. దారిపొడవునా ఆడపడుచుల హారతులు పడుతూ దిష్టితీస్తూ యువనేతను ఆశీర్వదించారు. యువతీ యువకులు డప్పు వాయిద్యాలు, తీన్మార్ దరువుల సందడి నడుమ డాన్సులు చేస్తూ ఉత్సాహభరిత వాతావరణంతో పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. కుప్పం ప్రజలు తమపై చూపుతున్న అభిమానానికి లోకేశ్ మురిసిపోయారు. దారిపొడవునా తమకోసం వేచిచూస్తున్న వృద్ధులు, మహిళలు, యువతీయువకులను ఆప్యాయంగా హత్తుకుని పలకరించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా కుప్పం ప్రజలు పాదయాత్రకు సంఘీభావంగా లోకేశ్‌తో అడుగులో అడుగు కలుపుతూ ముందుకు సాగారు.

జాతినేతలకు నివాళులు

కుప్పం బస్టాండు సమీపంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగువాడి గుండెచప్పుడు నందమూరి తారకరామారావు, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు యువనేత నారా లోకేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. పాదయాత్ర కొనసాగే రోడ్లకిరువైపులా కుప్పంవాసులు పాదయాత్రలో పాల్గొనేవారికి మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ సీనియర్ నేతలు, యువదళం వలంటీర్లు దగ్గరుండి పర్యవేక్షించారు.

ఉదయం ఎదురుచూపులు

కుప్పంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బసచేసిన యువనేత లోకేశ్‌ను చూసేందుకు ఉదయం 9గంటలనుంచే కుప్పం ప్రజలు ఉత్సుకతతో ఎదురుచూశారు. అక్కడికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలతో గెస్ట్ హౌస్ పరిసరాలు కిటకిటలాడాయి. అభిమానులకు లోకేశ్ అభివాదం చేస్తూ ఉదయం 10:05గంటలకు తన కాన్వాయ్‌లో జగన్నాథ ఆలయానికి పయనమయ్యారు.

చంద్రబాబునాయుడు ఏ ముఖ్యమైన కార్యక్రమం తలపెట్టినా తొలుత పూజలు నిర్వహించే శ్రీ ప్రసన్న వరదరాజస్వామి దేవాలయానికి ఉదయం 10:20గంటలకు లోకేశ్ చేరుకున్నారు. ఆలయ అర్చకులు, దేవస్థాన కమిటీ నాయకులు యువనేతకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం గోపూజ చేసి మహాపాదయాత్రకు శ్రీకారం చుట్టారు.

ఏపీ సర్కార్‌కు చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

అవసరం లేదు' అని హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేసిన రాష్ట్రం తరపు న్యాయవాదికి ధర్మాసనం తెలిపింది. ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఉన్న అహోబిలం ఆలయం ఎప్పటి నుంచో తమిళనాడులో ఉన్న శ్రీ అహోబిలం మఠం ఆధీనంలో ఉందని హైకోర్టులో ఒక పిటిషన్ పేర్కొంది. అహోబిలం ఆలయం 'అహోబిలం మఠంలో అంతర్భాగం, విడదీయరాని భాగం, ఇది హిందూ మత ప్రచారంలో భాగంగా, శ్రీ వైష్ణవ మత ప్రచారం కోసం ఆధ్యాత్మిక సేవను అందించడం కోసం స్థాపించబడింది. అక్టోబర్ 13, 2022 నాటి హైకోర్టు ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఇతరులు సవాలు చేశారు. మఠంలో భాగమైన ఆలయానికి కార్యనిర్వాహక అధికారిని నియమించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 26(డి)ని ఉల్లంఘించడమేనని, ఇది జీయర్లు, మఠాధిపతుల పరిపాలన హక్కును ప్రభావితం చేస్తుందని హైకోర్టు పేర్కొంది. 'దేవస్థానం' కార్యనిర్వాహక అధికారి నియామకాన్ని ప్రశ్నిస్తూ దాఖలయిన వేర్వేరు పిటిషన్లపై హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ధార్మిక శాఖలోని సెక్షన్ 29 ప్రకారం ధార్మిక సంస్థల చట్టం 1987 కేవలం ఆలయం అహోబిలం మఠానికి అనుబంధంగా ఉన్నందున ఆలయ నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు కార్యనిర్వాహక అధికారిని నియమించే అధికారం దేవాదాయ శాఖ కమిషనర్‌కు లేదని హైకోర్టు తప్పుబట్టిందని రాష్ట్రం తన పిటిషన్‌లో పేర్కొంది. 'ప్రస్తుత ఆలయం, అహోబిలం మఠం విభిన్నమైన, స్వతంత్ర న్యాయపరమైన వ్యక్తులని, అందువల్ల, 'మఠం' నిర్వచనంలో ఆ అంశంలో ఆలయాన్ని చేర్చడం అసంబద్ధంగా ఉందని గుర్తించడంలో హైకోర్టు విఫలమైంది' అని తెలిపింది.

ఐఎంఎఫ్ షరతులకు తలొగ్గిన పాక్

వెంటాడుతున్న సంక్షోభం-నిధులపైనే ఆశలు

25ఏళ్ల కనిష్ఠానికి రూపాయి

ఇస్లామాబాద్: పాకిస్తాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి రుణాలు పొందేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ రూపాయి మారకపు రేటుపై నిబంధనను సరళతరం చేసింది. దీంతో డాలరుతో పాక్ రూపాయి మారకపు ఊహించని రీతిలో పతనమైంది. రూపాయి విలువ 255కి పడిపోయింది. ఇంత పెద్దమొత్తంలో పాక్ రూపాయి పతనం కావడం ఆ దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. ఐఎంఎఫ్ సూచన మేరకు ద్రవ్య మారకపు రేటుపై పాక్ బుధవారం నిబంధనలను సడలించింది. దీంతో ఒక్కరోజులోనే పాక్ రూపాయి రూ.24 మేర క్షీణించింది. రూపాయిపై నియంత్రణలను సరళీకరించాలని, రూపాయి మారకపు విలువను మార్కెట్ నిర్ణయించేలా చూడాలని పాకిస్తాన్‌ను ఐఎంఎఫ్ కోరింది. ఐఎంఎఫ్ వద్ద పెండింగ్‌లో

ఉన్న 6.5 బిలియన్ డాలర్ల విడుదలకు ఆమోదం లభిస్తుందనే ఆశతో పాకిస్తాన్ వెంటనే షరతుకు అంగీకారం తెలిపింది. ఐఎంఎఫ్ నుంచి 6.5 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం తీసుకోవడానికి 2019లోనే పాక్ అంగీకరించినా, దాని కఠిన షరతుల వల్ల వెనక్కి తగ్గింది. నిధులివ్వాలంటే కరెంటు సబ్సిడీలను ఉపసంహరించాలనీ, అంతర్జాతీయ మార్కెట్ ధరలకు తగ్గట్టు గ్యాస్ ఛార్జీలను నిర్ణయించాలని తెలిపింది. పాక్ రూపాయి మారక విలువను మార్కెట్ ఆధారంగా నిర్ణయించాలనీ, లెటర్ ఆఫ్ క్రెడిట్లపై నిషేధం తొలగించాలని షరతులు విధించింది. ఇప్పుడు విడుదల చేయకపోతే రద్దయ్యే ప్రమాదం ఉండటంతో పాకిస్తాన్ ఈ కఠిన నిర్ణయాలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లో విదేశీ మారకపు నిల్వలు దారుణంగా పడిపోయాయి. మూడు వారాలకు సరిపడే నిల్వలు మాత్రమే ఉన్నాయి.

నిత్యావసరాలు కొండెక్కడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒక ప్యాకెట్ గోధుమ పిండి రూ.3000 కంటే ఎక్కువ పలుకుతోంది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దేశం మొత్తం అంధకారంలో కూరుకుపోయింది ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు 24 ఏళ్లలో లేని విధంగా పాకిస్తాన్ కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్లను అమాంతంగా పెంచేసింది.

వెనిజులా, క్యూబా సోదర దేశాలు: మదురో

కారకస్: వెనిజులా, క్యూబా సోదర దేశాలని, తమది విడదీయరాని బంధమని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో అన్నారు. చరిత్రాత్మక-విప్లవాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కానెల్‌తో భేటీలో నిర్ణయించినట్లు చెప్పారు. సమన్యాయం ఉండే గౌరవప్రద ప్రపంచమే తాము ఆకాంక్షించేదని ట్విట్టర్ ద్వారా మదురో తెలిపారు.

క్యూబా అధ్యక్షుడితో లాగురా రాష్ట్రంలో భేటీ అయి లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల ప్రజల సమస్యలను సమీక్షించినట్లు వెల్లడించారు. రెండు దేశాల బంధాల బలోపేతానికి సంకల్పించినట్లు మదురో ట్వీట్ చేశారు. అంతర్జాతీయ సహకారానికి అనుకూలంగా శాంతి-సహకార ప్రపంచ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నట్లు ఇద్దరు అధ్యక్షులు పునరుద్ఘాటించారు.

ఈ సమావేశం ప్రశాంత వాతావరణంలో ఫలప్రదంగా జరిగిందని సామాజిక మాధ్యమంలో తెలిపారు.

ఢిల్లీ వర్సిటీలో ఉద్రిక్తత

న్యూఢిల్లీ : ప్రధాని మోదీపై వివాదాస్పద బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శన నేపథ్యంలో ఢిల్లీ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో సెక్షన్ 144 విధించారు. పెద్ద సంఖ్యలో గుమిగూడిన విద్యార్థులను పోలీసులు చెదరగొట్టారు. ఈ సందర్భంగా 24 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిషేధించిన బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శన కోసం విద్యార్థి సంఘాలైన ఎన్ఎస్‌యూఐ, కేఎస్‌యూ శుక్రవారం ఆర్ట్స్ ఫ్యాకల్టీ వద్ద ఏర్పాట్లు చేశారు. అయితే దీనికి ఎలాంటి అనుమతిలేదని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకునేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అలాగే విద్యార్థులను వెళ్లగొట్టేందుకు పోలీసుల సహాయం కోరారు. మరోవైపు పోలీసులు పెద్ద సంఖ్యలో ఢిల్లీ విశ్వవిద్యాలయం క్యాంపస్‌కు వచ్చారు. ఆర్ట్స్ ఫ్యాకల్టీ వద్ద సెక్షన్ 144 విధించారు. గుమిగూడిన విద్యార్థులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పారు. పోలీసుల తీరును వ్యతిరేకించి నిరసనకు దిగిన 24 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఈ వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

రష్యాపై జపాన్ ఆంక్షలు తీవ్రం

టీకాలు, మందుల ఎగుమతులపై నిషేధం

టోక్యో: ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యల నేపథ్యంలో జపాన్ ఆ దేశంపై ఆంక్షలతో విరుచుకుపడింది. టీకాలు, ఔషధాల ఎగుమతులపై నిషేధం విధించింది. అలాగే, 22 మంది రష్యన్లు, మూడు కంపెనీల ఆస్తులను ఫ్రీజ్ చేసింది. ఈ మేరకు జపాన్ విదేశాంగ శాఖ శుక్రవారం ఒక ప్రకటన వెలువరించింది. రేడియోధార్మిక పదార్థాలు, వ్యాక్సిన్‌లు, వైద్యపరికరాలు, మందులు, రొబోట్‌లు, అణుధార్మిక పరికరాలు, చమురు, సహజవాయు అన్వేషణ పరికరాలు, బాష్పవాయువు, ఫింగర్‌ప్రింట్ పౌడర్ వంటి రసాయనాల ఎగుమతులను కూడా నిషేధించనున్నట్లు ప్రకటించింది. ఈ ఆంక్షలు ఫిబ్రవరి 3 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. అలాగే 49 రష్యన్ కంపెనీలు, సంస్థలపై ఎగుమతి పరిమితులను విధిస్తున్నట్లు పేర్కొంది. 22 మంది రష్యన్ల ఆస్తులను స్తంభింపచేసింది. ఈ జాబితాలో రష్యా బాలల హక్కుల కమిషనర్ మరియా ల్వోవా బెలోవా, ఉప ప్రధానులు ఆండ్రీ బెలౌసోవ్, డిమిత్రి చెర్నిషెంకో, న్యాయమంత్రి, కేంద్ర ఎన్నికల సంఘం అధ్యక్షురాలు సహా ప్రముఖ రష్యన్ ట్రక్, బస్సు, ఇంజిన్ తయారీ సంస్థ కమాజ్, విమానాల తయారీ సంస్థ ఇర్కుట్, మాస్కోకు చెందిన క్షిపణి తయారీదారు, సరఫరాదారు అవన్‌గార్డ్ సంస్థలు ఉన్నాయి.

విపక్షాల భేటీ కోసం ఎదురుచూస్తున్నా

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నానని నితీశ్ వివరించారు. 'మా పార్టీ సభ్యత్వం 50 లక్షల నుంచి 75 లక్షలకు పెరిగింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మా పార్టీకి సీట్లు తగ్గాయి. దీనికి ప్రధాన కారణం నాటి మిత్రపక్షం బీజేపీ మాకు పూర్తిస్థాయిలో మద్దతివ్వలేదు' అని చెప్పారు. ఎల్‌జేపీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ తోడ్పాటుతో తమ పార్టీని దెబ్బకొట్టడానికి బీజేపీ కుట్ర చేసిందని ఆరోపించారు. 'ఈ పార్టీ కుశ్వాహాకు చాలా ఇచ్చింది. ఈ విషయం ఆయన గుర్తుంచుకోవాలి. అసెంబ్లీ, రాజ్యసభకు మా పార్టీ ద్వారానే ఆయన వెళ్లారు. ప్రస్తుత ఎమ్మెల్సీ పదవి కూడా జేడీయూ నుంచి వచ్చిందే'నని నితీశ్ వివరించారు.

అరకొర వేతనాలు

(మొదటిపేజీ తరువాయి)

కంటే తక్కువ మంది కార్మికులకు పీఎఫ్ ఉన్నట్లు నివేదిక పేర్కొంది. 90 శాతం మందికి అరకొర వేతనాలు అందుతున్నాయి. ఈపీఎఫ్, ఈఎస్ఐ సేవలు అసలే లేవు. సాంకేతిక పరిజ్ఞాన లోపం కారణంగా నిర్మాణ రంగం నియామకాలలో పారదర్శకత లోపించింది. కార్మికులు చాలా తక్కువ వేతనాలకు పని చేయాల్సి వస్తున్నదని ప్రాజెక్ట్ హీరో వ్యవస్థాపకుడు, సీఈఓ సత్యవ్యాస్ వెల్లడించారు. నియామకాల సమయంలో చట్టనిబంధనల ఉల్లంఘన జరుగుతోందన్నారు. 50 మిలియన్లకుపైగా కార్మికులు అనధికారిక మార్గాల ద్వారానే పని వెతుక్కోవాల్సి వస్తోందని, పది మిలియన్ల మంది కాంట్రాక్టర్లు తమ వ్యాపారం కోసం సిఫార్సులపైనే ఆధారపడుతున్నట్లు చెప్పారు. వీటి సాధన కోసం కార్మికులకు ఒక వేదిక అంటూ లేకుండా పోయిందని ఆయనన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలు బేఖాతరు

ఢిల్లీ, ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, పూనే నగరాల్లో నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం సూచించినట్లుగా దినసరి వేతనాలు అందడం లేదని నివేదిక పేర్కొంది. నైపుణ్యత లేని కార్మికుల విషయంలో ఇది చాలా ఎక్కువగా జరుగుతున్నట్లు వెల్లడించింది. ఢిల్లీలో హెల్పర్లుగా పనిచేసే 90.9 శాతం మందికి రోజువారీ కూలీ రూ.711 కూడా లభించడం లేదని తెలిపింది. బెంగళూరులో 90.4శాతం, పూనేలో 88 శాతం, ముంబైలో 87.3 శాతం, హైదరాబాద్‌లో 78.5 శాతం మందికి కనీస వేతనాలు లభించడం లేదని పేర్కొంది. హైదరాబాద్‌లో 87 శాతం మంది నిర్మాణ రంగ కార్మికులకు కనీసం కంటే తక్కువ వేతనాలు ఇస్తున్నట్లు వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీలో పరిస్థితి మరీ దారుణమని పేర్కొంది. సూపర్‌వైజర్లలో 26.7 శాతం మందికి రూ.866 (కనీస వేతనం) లభిస్తోందని, అన్ని నగరాల్లో కంటే ఈ శాతం చెన్నైలోనే తక్కువగా ఉందని, పూనేలో అత్యధికంగా 42.4శాతం సూపర్‌వైజర్లకు కనీస వేతనం కరువైందని ప్రాజెక్ట్‌హీరో వెల్లడించింది.

హైదరాబాద్‌లో గరిష్ఠం-ఢిల్లీలో కనిష్ఠం

రోజువారీ కూలీ హైదరాబాద్‌లో అధికం కాగా ఢిల్లీలో అత్యల్పంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. హెల్పర్లకు రోజుకు రూ.584 లెక్కన హైదరాబాద్‌లో చెల్లిస్తుంటే...ఢిల్లీలో రూ.515 మాత్రమే ఇస్తున్నారు. టెక్నీషియన్లకు హైదరాబాద్‌లో రూ.862, ఢిల్లీలో రూ.718 చొప్పున చెల్లిస్తారు. సూపర్‌వైజర్లకు హైదరాబాద్‌లో కొంత మెరుగుగా రూ.1035 లభిస్తున్నాయి. పూనేలో రూ.885 మాత్రమే ఇస్తారు. ఇదే అత్యల్పం. ఢిల్లీలో కొంత మెరుగ్గా రూ.925 చెల్లిస్తున్నారని నివేదిక పేర్కొంది. మరోవైపు, 4,500 మంది ఉద్యోగుల్లో కేవలం పది శాతానికే పీఎఫ్, ఈఎస్ఐ ఉన్నట్లు నివేదిక తెలిపింది. 8.6శాతం ఉద్యోగుల్లో ఈపీఎఫ్ సౌకర్యం ఉందని, 7.1శాతం ఉద్యోగులకు ఈఎస్ఐ బీమా ఉన్నదని పేర్కొంది.

వలస కూలీల కేంద్రం మహారాష్ట్ర

వలస కూలీలు ఎక్కువగా మహారాష్ట్ర వెళ్లడానికి ఇష్టపడుతున్నట్లు నివేదిక తెలిపింది. పదిన్నర వేల మంది వలసదారులు ఉద్యోగాల కోసం ఈ రాష్ట్రాన్నే ఎంచుకున్నట్లు వెల్లడించింది. ఐదున్నర వేల దరఖాస్తులు ఉత్తరప్రదేశ్ నుంచి రాగా నాలుగు వేల దరఖాస్తులు హరియాణా నుంచి వచ్చినట్లు పేర్కొంది. మహారాష్ట్రలోనే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఆ తర్వాత స్థానాల్లో యూపీ, గుజరాత్ ఉన్నాయని నివేదిక పేర్కొంది. నిర్మాణ రంగం క్రమబద్ధీకరణ క్రమంగా జరుగుతోందని, అనేకమంది కాంట్రాక్టర్లు చాలా వరకు డిజిటల్ మాధ్యమాల ద్వారా లావాదేవీలు, ఇతర ప్రక్రియలు కొనసాగిస్తున్నారని నివేదిక తెలిపింది. 1.22 లక్షల మందికిపైగా కార్మికులు తమ బ్యాంకు ఖాతాలను ధ్రువీకరించడం ద్వారా డిజిటలీకరణ పెరిగినట్లు చెప్పగలమని పేర్కొంది. స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరగడం, ఇంటర్నెట్ వినియోగం డేటా తక్కువ ధరకు లభించడం, ప్రభుత్వ ప్రోత్సాహం ఉండటంతో డిజిటల్ అక్షరాస్యత పెరుగుతోందని వెల్లడించింది.

సినీనటి జమున కన్నుమూత

అలనాటి సినీనటి జమున(86) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ చిత్రాల్లో ఆమె నటించారు. 1936 ఆగస్టు 30న హంపీలో జమున జన్మించారు. ఆమె తండ్రి పేరు నిప్పణి శ్రీనివాసరావు, తల్లి కౌసల్యాదేవి. సినిమాల్లోకి రాకముందు ఆమె పేరు జానాభాయి. జ్యోతిషుల సూచనతో ఆమె తల్లిదండ్రులు జమునగా పేరు మార్చారు. గుంటూరులోని దుగ్గిరాల బాలికల పాఠశాలలో ఆమె చదువుకున్నారు. తల్లి దగ్గరే గాత్ర సంగీతం, హార్మోనియం నేర్చుకున్నారు. చిన్న వయసులోనే ప్రజా నాట్యమండలి అధ్వర్యంలో ప్రదర్శించే "మా భూమి" నాటకంలో ఒక పాత్ర ద్వారా కళాకంగంలో ప్రవేశించి, ప్రజా నాట్యమండలి దర్శకుడు, ప్రయోక్త, నిర్మాత డాక్టర్ గరికపాటి రాజారావు, బుర్రకథ పితామహుడు నాజర్, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి మొదలగు వారితో పనిచేశారు. 16 సంవత్సరాల వయసులో డాక్టర్ రాజారావు దర్శకత్వంలో వచ్చిన 'పుట్టిల్లు' సినిమాతో సినీరంగ ప్రవేశం చేశారు. ఆ తరువాత సినీ రంగంలో తిరుగులేని నాయకురాలిగా వివిధ రకాల పాత్రలు ధరించి దక్షిణ భారతదేశంలో పేరొందారు. ఆమె ఆఖరి శ్వాస వరకు ప్రజానాట్యమండలి శ్రేయోభిలాషిగా, చాలాకాలం అధ్యక్షవర్గ సభ్యురాలిగా కొనసాగారు. ప్రజానటిగా ఎందరికో ఆదర్శమయ్యారు. గడుసైన పాత్రలు, ముఖ్యంగా సత్యభామ పాత్రకు జమున కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీల్లో కొన్ని వందల చిత్రాల్లో ఆమె నటించారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీ రంగారావు, కృష్ణ సహా పలువురు దిగ్గజ నటులతో ఆమె నటించి సినీ ప్రియులను అలరించారు. నటిగానే కాకుండా రాజకీయాల్లోనూ జమున రాణించారు. 1989లో కాంగ్రెస్ పార్టీ తరఫున రాజమహేంద్రవరం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అశ్రునయనాల మధ్య జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జమున అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆమె కూతురు స్రవంతి దహన సంస్కారాలు నిర్వహించారు.

ఒక్కరోజులో రూ.48వేల కోట్లు ఆవిరి

(మొదటిపేజీ తరువాయి)

పవర్ ఐదు శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 19.9శాతం, అదానీ టోటల్ గ్యాస్ 20శాతం చొప్పున పడిపోయాయి. రిటైల్ పెట్టుబడిదారుల కోసం నిర్వహించే సెకండరీ షేర్ సేల్ రికార్డు స్థాయిలో 2.45 బిలియన్ డాలర్ల (రూ.20వేల కోట్ల)తో మొదలైంది. ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు అదానీ గ్రూప్ ఫాలో అన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో)కు వెళ్లనున్న నేపథ్యంలో హిండెన్‌బర్గ్ నివేదిక ఆసక్తికరంగా పరిణమించింది. ఎఫ్‌పీఓలో గ్రూప్ స్టాక్స్ ప్రైస్ బ్రాండ్ రూ.3112 నుంచి రూ.3276 మధ్య ఉంటుందని అంచనా. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.5,985 కోట్ల పెట్టుబడులు సేకరించినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఇప్పటికే ప్రకటించింది.

అదానీ గ్రూప్ స్టాక్స్ రూ.48 వేల కోట్ల మేరకు పతనం కాకముందు గౌతం అదానీ వ్యక్తిగత సంపద 120 బిలియన్ డాలర్లు. అందులో 100 బిలియన్ డాలర్లను మూడేళ్లలో కూడబెట్టారు. అదానీ గ్రూప్‌లోని ఏడు లిస్టెడ్ కంపెనీలు 819 శాతం లబ్ధిపొందాయి. పెట్టుబడులకు స్వర్గధామంగా ఉండే మారిషస్, కరేబియన్, యూఏఈ దేశాల్లో షెల్ కంపెనీల్లో పెట్టుబడుల ద్వారా అదానీ కుటుంబ ఆదాయం పెరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల నుంచి షెల్ కంపెనీలకు నగదు బదిలీ చేస్తుందని సమాచారం.

హిండెన్‌బర్గ్ నివేదిక నిరాధారితం: అదానీ గ్రూప్

హిండెన్‌బర్గ్ నివేదిక ఎలాంటి ఆధారాల్లేకుండా, అవాస్తవాలభరితంగా ఉన్నట్లు అదానీ గ్రూప్ ఆరోపించింది. తమ ఎఫ్‌పీఓను నాశనం చేయాలనే ఇలా చేసినట్లు తెలిపింది. 'జనవరి 24న వెలువడిన హిండెన్‌బర్గ్ పరిశోధన నివేదికను చూసి షాకయ్యాం. మమ్మల్ని సంప్రదించకుండా, వాస్తవాల్ని తెలుసుకోకుండా ఈ నివేదిక వెలువరించారు. మాపై ఏకపక్షంగా ఆరోపణలు చేశారు. మా గ్రూప్ షేర్ల విక్రయాన్ని దెబ్బతీయాలన్నదే వీరి ఉద్దేశంగా తోస్తోంది' అని అదానీ గ్రూపు ప్రకటన పేర్కొంది.

ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

మార్చి 1న మూడు ప్రధాన కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు, ప్రజాప్రతినిధులు విధిగా ఆసుపత్రుల సందర్శన, గోరుముద్దలో భాగంగా పిల్లలకు వారానికి మూడుసార్లు రాగిమాల్ట్ పంపిణీ ఆరోజు నుంచి ప్రారంభమవుతాయన్నారు. ప్రజాప్రతినిధుల ఆస్పత్రుల సందర్శనతో పర్యవేక్షణ పెరుగుతుందని, ఇంకా సమస్యలు, లోపాలు ఉంటే వారి నుంచి తెలుసుకొని పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ప్రజారోగ్య వ్యవస్థ మరింత బలోపేతానికిఇది దోహదపడుతుందన్నారు. ఆస్పత్రుల్లో మందులు, సర్జికల్స్ అందుబాటులో ఉండాలని, మందులకు కొరత మాటే వినిపించకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రజారోగ్య వ్యవస్థలో మన రాష్ట్రం ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. వైద్య ఆరోగ్య సిబ్బందిని సంపూర్ణస్థాయిలో ఉపయోగించుకోవాలని, గ్రామ సచివాలయ స్థాయిలోనే ఎనీమియా వంటి కేసులను గుర్తించాలన్నారు. వైద్యారోగ్యశాఖ, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మధ్య పూర్తి సమన్వయం ఉండాలని, పాఠశాలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు అనుసంధానమై తల్లులు, పిల్లలలో రక్తహీనత వంటి సమస్యలను పూర్తిగా నివారించాలని సూచించారు.

విలేజ్ క్లినిక్స్ సిబ్బంది చెప్పే సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టేలా వ్యవస్థలను సిద్ధం చేయాలని సీఎం జగన్ చెప్పారు. వీటిపై మండలస్థాయి అధికారులు, జేసీ, కలెక్టర్ పర్యవేక్షణ ఉండాలని, పరిసరాల పరిశుభ్రత, సమతుల్య ఆహారం, వ్యాయామం ఇతర ఆరోగ్య అంశాలను పాఠ్యప్రణాళికలో చేర్చాలని, 108, 104 వాహనాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. సిబ్బంది ప్రతి కుటుంబాన్నీ కలిసి విలేజ్ క్లినిక్కుల సేవలు వివరించాలన్నారు. గుండెజబ్బులు, క్యాన్సర్, బీపీ, మధుమేహం వంటి ఎన్సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) నివారణ, చికిత్సలపై సీఎం సమీక్షించారు. రక్తపోటు, మధుమేహం వంటి ఎన్సీడీ బాధితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కిడ్నీ బాధిత ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టామని, ఉద్దానంలో కిడ్నీ వ్యాధి నివారణకు రూ.700 కోట్లు ఖర్చుపెడుతున్నామని, పాలకొండకు మరో రూ.265 కోట్లు ఖర్చు చేస్తున్నామని, పలాసలో కిడ్నీ పరిశోధనా కేంద్రం, ఆస్పత్రిని నిర్మిస్తున్నామని సీఎం వివరించారు. ప్రతి బోధనాసుపత్రిలోనూ గుండెజబ్బుల చికిత్సా కేంద్రాలు, క్యాథ్ ల్యాబ్‌లు పెట్టాలని సీఎం ఆదేశించారు. చిన్నారులు, స్కూలు పిల్లల్లో దంత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జె.నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి.మురళీధర్‌రెడ్డి, ఏపీవీవీపీ కమిషనర్ వి.వినోద్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్(డ్రగ్స్) రవిశంకర్, ఆరోగ్యశ్రీ సీఈఓ ఎంఎన్‌హెచ్ ప్రసాద్, ఏపీ మెడికల్ కౌన్సెల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆగిన 'భారత్ జోడో యాత్ర'

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిందని రాహుల్ గాంధీ తెలిపారు. జమ్ము ప్రాంతంలోని బనిహాల్ నుంచి తన యాత్రను ప్రారంభించిన గాంధీ... బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో జవహర్ సొరంగం దాటి ఖాజీగుండ్‌లోని లోయలోకి ప్రవేశించారు. అయితే ఆ తర్వాత కేవలం 500 మీటర్ల దూరం మాత్రమే నడవగలిగారు. రాహుల్‌ను కలిసేందుకు గుమిగూడిన పెద్ద జనసమూహాన్ని నియంత్రించడానికి పోలీసు సిబ్బంది గైర్హాజరు కావడంతో ఆయన భద్రతా బృందం యాత్రను నిలిపివేయవలసిందిగా రాహుల్‌ను కోరింది. 'జన సమూహాన్ని నియంత్రించాల్సిన పోలీసు సిబ్బంది ఎక్కడా కనిపించలేదు' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఇక్కడ విలేకరులకు విడుదల చేసిన క్లుప్త ప్రకటనలో తెలిపారు. అనంత్‌నాగ్ జిల్లాలోని ఖానాబల్ డాక్ బంగ్లాలో రాత్రి బస చేసే ముందు ఆయన వెస్సుకు 11 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి ఉంది. 'భద్రత కల్పించడం జమ్ముకశ్మీర్ పాలనా యంత్రాంగం బాధ్యత. యాత్ర మిగిలిన రోజులకు భద్రత కల్పిస్తారని నేను ఆశిస్తున్నాను. ఇది ఎందుకు జరిగిందో నాకు తెలియదు. కానీ రేపు, ఆ తర్వాత ఇది జరగకూడదు' అని గాంధీ పేర్కొన్నారు. 'నేను నా భద్రతా సిబ్బందికి వ్యతిరేకంగా వెళ్లలేనందున పాదయాత్రను విరమించుకోవలసి వచ్చింది' అని అన్నారు. సెప్టెంబరులో కన్యాకుమారిలో ప్రారంభమైన భారత్ జోడో యాత్ర జనవరి 30న శ్రీనగర్‌లో ముగియనున్నది. ఈ సంఘటనను 'పెద్ద భద్రతా లోపం' అని ఆయన పార్టీ సహచరుడు జైరాం రమేశ్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ భద్రతా బృందం రాబోయే కొద్ది రోజులు ప్రతిదీ సజావుగా జరిగేలా జమ్ముకశ్మీర్ పాలనా యంత్రాంగంతో చర్చలు జరుపుతోందని అన్నారు. 'రాజకీయానికి దాని స్థానం ఉంది. కానీ జమ్ముకశ్మీర్‌లో రాహుల్ గాంధీ భద్రతతో ఆడుకోవడం ద్వారా ప్రభుత్వం దాని అత్యల్ప స్థాయికి పడిపోయింది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హిందీలో ట్వీట్ చేశారు. భారతదేశం ఇప్పటికే ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీని కోల్పోయిందని, ఏ ప్రభుత్వమైనా, పాలనా యంత్రాగమైనా అయినా ఇలాంటి సమస్యలపై రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆయన అన్నారు. పార్టీ నాయకులు అనేక మంది కూడా ఇదే ఆరోపణ చేశారు. ప్రభుత్వం గాంధీ చుట్టూ ఉన్న భద్రతా సిబ్బందిని ఉపసంహరించుకుందని ఆరోపిస్తూ, ఉల్లంఘనకు కారణమైన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ఇది ఎవరు ఆదేశించారు?' అని ఏఐసీసీ ప్రధాన కార్యదరి కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 'బాధ్యులైన అధికారులు ఈ లోపానికి సమాధానం చెప్పాలి. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి' అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ రజనీ పాటిల్ మాట్లాడుతూ 'భద్రతా లోపాలు కేంద్ర పాలిత ప్రాంత పరిపాలన యంత్రాంగం అన్యాయమైన, సంసిద్ధత లేని వైఖరిని సూచిస్తున్నాయి' అని తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా, భద్రతా యంత్రాంగం ఆమోదించిన యాత్ర మార్గంలో భారీ జన సమూహాన్ని నియంత్రించడంలో లోపం ఉన్నందున మేము యాత్రను తాత్కాలికంగా ఆపవలసి వచ్చింది' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. రాహుల్ గాంధీని ఆయన భద్రతా సిబ్బంది వెంటనే పాదయాత్రను నిలిపివేయాలని కోరారు. దీంతో ఆయన ఖానాబాల్‌లోని అతిథి గృహానికి వెళ్లారు. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గాంధీతో కలిసి పాదయాత్రలో ఉదయం ప్రారంభమైంది. 7 డిగ్రీల సెల్సియస్ చలిలో ఇద్దరు నేతలు ఒకే విధమైన తెల్లటి టీ-షర్టులు ధరించారు. ఉదయం దాదాపు మూడు కిలోమీటర్లు నడిచి 2.85 కి.మీ జవహర్ సొరంగం గుండా ప్రయాణించారు. సొరంగం దాటిన తర్వాత, గాంధీతో పాటు పార్టీ నాయకులు షెడ్యూల్ చేసిన హాల్ట్ వద్ద భద్రత కల్పించడానికి పోలీసులు లేరని గుర్తించారు. దీంతో గాంధీ భద్రతా బృందం ఆయనను కారు దిగేందుకు అనుమతించలేదు. ఇదిలాఉండగా, శ్రీనగర్‌కు 33 కిలోమీటర్ల దూరంలోని అవంతిపోరా నుంచి కాంగ్రెస్ నాయకుడు శనివారం తన యాత్రను పున: ప్రారంభించనున్నారు.

విద్యపై దృష్టి కేంద్రీకరించి లక్ష్యాలు సాధించాలి

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో విద్యపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. న్యూఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం నిర్వహించిన 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని మేరీస్టెల్లా కళాశాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యా యులకు పాఠ్యాపుస్తకాలను అందజేసి మాట్లాడుతూ అత్యం త కష్టమైన సబ్జెక్టులను తీసుకున్నప్పుడు విద్యార్థులకు ఏకాగ్రత అవసరమన్నారు. ఒక పరీక్ష జీవితానికి ముగింపు కాదని, ఫలితాల గురించి అతిగా ఆలోచించడం ఒక అంశంగా మారకూడదన్నారు. పరీక్షా విధానం విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహదపడేదిగా ఉంటుం దన్నారు. విద్యార్థులు యోగా, ధ్యానం చేయడం, మనస్సును నియంత్రించుకోవడం ద్వారా మంచి ఫలితాలను సాధించ వచ్చని సూచించారు. అనంతరం గవర్నర్ హరిచందన్ పటమట కోనేరు బసవయ్య చౌదరి బాలుర ఉన్నత పాఠశాల, జీడీఇటీ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల, మేరీస్టెల్లా కళాశాల, పటమట లంక కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎగ్జామినేషన్ వారియర్ పుస్తకాలను అందజేసి అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎం.వి.శేషగిరిబాబు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఆర్జేడీలు ఐ.శారద, యు.వి. సుబ్బారావు, డి.మధుసూదనరావు, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి, డీడీ తాతారావు, డీఇవో సి.వి.రేణుక, ఆర్ఐవో పి.రవికుమార్, డిప్యూటి డీఇవో రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులు చైతన్యవంతం కావాలి

డైరీ ఆవిష్కరణలో కరవది సుబ్బారావు పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: దళితులు రాజకీయంగా, ఆర్థికంగా మరింత ఎదగాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో డీహెచ్‌పీఎస్ 2023 నూతన డైరీని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో దళితుల పాత్ర పరిమితంగా మారిందని, రాజకీయ పార్టీలు దళితులను ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగిస్తున్నారని చెప్పారు. దళితుల అభివృద్ధి పట్ల పాలకులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో కులవివక్ష, అంటరానితనం ఇంకా కొనసాగడం దారుణమని వ్యాఖ్యానించారు. దళితులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కుల ద్వారా కొంతమేరకు అభివృద్ధి సాధించినప్పటికీ వివక్షత మాత్రం అంతం కావడం లేదన్నారు. ఏ స్థాయిలో ఉన్నా దళితులకు వివక్ష తప్పడం లేదని వ్యాఖ్యానించారు. కలెక్టర్ నుంచి అటెండర్ వరకు, మంత్రి నుంచి సర్పంచ్ వరకు ఇదే పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వెలిబుచ్చారు. మార్పు కోసం అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, పెరియార్ రామస్వామి, నారాయణ గురు తదితర మహనీయుల మార్గంలో దళిత, గిరిజనం నడవాల్సిన అవసరం ఉందన్నారు. దళిత హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, ముత్తన అంజయ్య, మంద ఇస్రాయేలు, పాటిబండ్ల సిద్ధయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జమున కళాప్రస్థానం సుస్థిరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సినీనటి, మాజీ ఎంపీ జమున మరణంపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. హైదరాబాద్‌లో ఆమె భౌతికకాయానికి ప్రజానాట్య మండలి జెండా కప్పి నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రజానాట్యమండలితో ప్రారంభమైన జమున కళా ప్రస్థానం దక్షిణాది చలనచిత్ర చరిత్రలో సుస్థిరమైందని తెలిపారు. తెలుగు సినీ వినీలాకాశంలో అగ్ర నాయకులు ఎన్టీఆర్, ఏఎన్నార్‌లతో జోడీగా నటించి తనదైన ముద్రవేశారని గుర్తుచేశారు. నవరస నటనతో అంచెలంచెలుగా ఎదిగి 198 తెలుగు చిత్రాలు, వివిధ బహుబాషా చిత్రాలతోపాటు హిందీ చిత్రాల్లోనూ నటించి మెప్పించారన్నారు. ఫిలింఫేర్ అవార్డుతోపాటు చాలా అవార్డులు ఆమెకు లభించాయని, 25 ఏళ్లుగా తెలుగు ఆర్టిస్టులకు వివిధ సేవా కార్య క్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. జమున మరణంపట్ల ప్రగాఢ సంతాపాన్ని, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కళా ప్రపంచానికి బాధాకరం: నారాయణ : కళామతల్లి ముద్దుబిడ్డ, ప్రజా నాట్యమండలి సభ్యురాలైన జమున మృతి కళాప్రపంచానికి బాధాకరం. ఎంత ఎదిగినా, ప్రజానాట్యమండలి కుటుంబమేనాది అని చెప్పిన జమున మన మధ్య లేకపోవడం తీరలేటుగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ పేర్కొన్నారు. తాను సీపీఐ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పుడు ప్రజానాట్యమండలి కార్యక్రమం నిమిత్తం ఆహ్వానిస్తే వచ్చి ఆమె 'నా కుటుంబాన్ని చూసినంత ఆనందంగా ఉంది' అని సంతోషపడ్డారు. ఆమె మరణం పట్ల ప్రగాఢ సంతాపం తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావు, ప్రజానాట్యమండలి జాతీయ నాయకుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి కూడా జమున మృతికి సంతాపం తెలిపారు.

సీపీఎం సంతాపం : సినీ నటి జమున మృతి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. ప్రజానాట్య మండలి వ్యవస్థాపకుడు గరికిపాటి రాజారావు ద్వారా జమున కళా ప్రస్థానం ప్రారంభమై నాటక, సినీ రంగాల్లో, పార్లమెంటు సభ్యురాలిగా సేవలనందించారని ఆయన తెలిపారు. ఆమె మరణం కళా, సినీ రంగానికి తీరని లోటు అని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సంతాపం: నటి జమునా మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంక టేశ్వర్లు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రా నాయక్, పెంచలయ్య, సీనియర్ నాయకులు గని, రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, సహాయ కార్యదర్శి ఎస్కె నజీర్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. కళల ద్వారా సమాజ చైతన్యానికి ఎనలేని కృషి చేస్తున్న జమునను ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు గరికపాటి రాజారావు 'పుట్టిల్లు' సినిమా ద్వారా వెండితెరకు పరిచయం చేయడంతో మట్టిలో మాణిక్యం తరహాగా జమున అత్యున్నత స్థాయికి ఎదిగారన్నారు. సినిమా రంగం ద్వారా వైవిధ్యభరితమైన పాత్రలతో సమాజానికి ఉపయోగపడ్డారని తెలిపారు. ఒక సాధారణ కళాకారిణిగా అంచెలంచెలుగా నటనా రంగంలోను, రాజకీయ రంగంలోను మంచి స్థాయికి ఎదిగారని తెలిపారు. అలాంటి కళాకారులు మరణం సమాజానికి, కళా రంగానికి తీరని లోటన్నారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ప్రముఖుల సంతాపం: జమున మరణవార్త తెలిసిన సినీ, రాజకీయ ప్రముఖులు అనేకమంది సంతాపం వ్యక్తం చేశారు. సినీ నటుడు చిరంజీవి, బాలకృష్ణ, పవన్ కల్యాణ్, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు, డైరెక్టర్లు నందినీ రెడ్డి, బాబీ, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, గవర్నర్ తమిళిసై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రజానాట్య మండలి జాతీయ నాయకుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.

మన పోలీసులు భేష్

విశ్వాసం, సమర్థత, నిజాయతీలో అగ్రభాగం

కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల సర్వే వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలీసు శాఖకు సంబంధించి ప్రజావిశ్వాసం, సమర్థత, నిజాయతీపై నిర్వహించిన సర్వేలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ప్రథమ స్థానంలో నిలిచారు. పోలీసుశాఖపై ప్రజల విశ్వాసంలో ఆంధ్రప్రదేశ్‌కు మొదటి స్థానం లభించింది. సమర్థత, నిజాయతీ అంశాలలోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచింది. న్యూఢిల్లీలో ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు డీజీపీల సమావేశం జరిగింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పోలీసుశాఖపై కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో నిర్వహించిన సర్వే నివేదికను కేంద్రం వెల్లడించింది. ఈ సమావేశానికి ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, పోలీసుశాఖకు గర్వకారణ మని డీజీపీ వెల్లడించారు. గతేడాది పోలీసుశాఖ తీసుకున్న ప్రత్యేక చర్యల ద్వారా ఈ ఫలితాలు లభించాయన్నారు. రూ.1.7 కోట్లతో దిశ మొబైల్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్లు, సాంకేతికతతో కూడిన కచ్చితమైన సాక్ష్యాధారాలు, నేర నిరూపణతో శిక్షపడేలా దర్యాప్తు, పీపుల్ ఫ్రెండ్లీ పోలీసు, సాంకేతిక విని యోగం ద్వారా త్వరితగతిన పోలీసు ప్రతిస్పందన, పోలీసుల్లో క్రమశిక్షణ విధానాన్ని పెంపొందిం చడం తదితర చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో ఎస్పీల నుంచి కానిస్టేబుళ్ల వరకు చేసిన కృషి వల్ల ఈ ఫలితాలు లభించాయన్నారు. ఈ ఫలితాల సాధన కోసం సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

సర్వే ఫలితాల వివరాలివీ: సర్వేలో ఆంధ్రప్రదేశ్‌కు మొదటి స్థానం దక్కగా రెండో స్థానంలో తమిళనాడు, మూడో స్థానంలో తెలంగాణ, నాలుగులో గుజరాత్, ఐదో స్థానంలో దిల్లీ నిలిచాయి. సమర్థతలోనూ మొదటి స్థానం ఆంధ్రప్రదేశ్‌కు దక్కింది. తెలంగాణకు రెండో స్థానం, గుజరాత్‌కు మూడు, హిమాచల్ ప్రదేశ్‌కు నాలుగు, జార్ఖండ్‌కు ఐదో స్థానం లభించాయి. నిజాయతీలోనూ ఆంధ్రప్రదేశ్‌కు మొదటి స్థానం, ఉత్తరాఖండ్‌కు రెండు, తెలంగాణకు మూడు, గుజరాత్‌కు నాలుగు, దిల్లీకి ఐదో స్థానం లభించాయి.

హామీలు అమలు చేయాలి

పార్వతీపురంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ

విశాలాంధ్ర-పార్వతీ పురం: రైతు వ్యతిరేక మూడు నల్లచట్టాలను రద్దు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రైతుపండించిన పంటలకు మద్దతుధరలచట్టం తేవాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపట్ల అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపుమేరకు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో శుక్రవారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో రాయగడ రోడ్లో ఉన్న మార్కెట్ కమిటీ యార్డ్ నుంచి పాతబస్టాండు, నాలుగు రోడ్ల కూడలి, పద్మశ్రీ సినిమాహాల్, ఆర్టీసీ కాంప్లెక్స్, బెలగాం మీదుగా సుందరయ్య భవనంవరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, రైతు ప్రభుత్వాలని చెప్పుకోవడం తప్ప రైతులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేస్తున్న మేలేమిలేదన్నారు. ఈ కార్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పల నాయుడు, ఈదుబిల్లి వెంకటనాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటుదాసు, కరణంరవీంద్ర, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, పి శ్రీను నాయుడు (సంయుక్త, కార్యదర్శి), అఖిల భారత రైతు కూలీసంఘం నాయకులు బొత్స నరసింగరావు, పోలరమణి, గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.సంగం, వివిధ సంఘాల నాయకులు గేదెల సత్యనారాయణ, విశ్వేశ్వర రావు, వెలమల సత్యనారాయణ, ద్వారపూడి అప్పలనాయుడు, మర్రిసీతారాందొర, రెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, కొల్లి సాంబమూర్తి, గంగునాయుడు, రెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొని మద్దతు ఇచ్చారు.

హైకోర్టు అదనపు న్యాయమూర్తులు

జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ గోపాల కృష్ణారావు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం అదనపు న్యాయ మూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెనుతురుమల్లి గోపాల కృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం నేలపాడులోని హైకోర్టు మొదటి కోర్టు హాలులో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలుత భారత రాష్ట్రపతి జారీ చేసిన నోటిఫికేషన్ ఆర్డరును రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణరావు చదివి వినిపించారు. అనంతరం రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా వారిద్దరిచే వేర్వేరుగా అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హారీ, జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎన్.జయసూర్య, డా.జస్టిస్ కె.మన్మథ రావు, జస్టిస్ బి.ఎస్.భానుమతి, జస్టిస్ ఎన్.వెంకటేశ్వర్లు, జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి, జస్టిస్ రవి చీమలపాటి, జస్టిస్ ఎ.వి. రవీంద్రబాబు, జస్టిస్ వి.ఆర్.కె.కృపా సాగర్, జస్టిస్ శ్రీనివాస్ ఉటుకూరు, అడ్వకేట్ జనరల్ శ్రీరామ్, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఘంటా రామారావు, రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.జానకి రామి రెడ్డి, సీనియర్ అడ్వకేట్లు, అడ్వకేట్లు, రిజిస్ట్రార్లు తదితరులు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాదయాత్రలో అపశృతి

తారకరత్నకు గుండెపోటు

విశాలాంధ్ర-కుప్పం: కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహించనున్న యువగళం పాదయాత్రను తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుప్పం నుంచి మొదలు పెట్టారు. మొదటి రోజు పాదయాత్ర లో లోకేశ్‌కు మద్దతుగా నందమూరి బాలకృష్ణ, నందమూరి తారక రత్న పాల్గొన్నారు. లక్ష్మీపురం వరదరాజ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్ర మొదలైన కాసేపటికే లక్ష్మీపురం మసీదు వద్ద ఒక్కసారిగా నందమూరి తారకరత్న స్పృహ తప్పి కుప్ప కూలిపోయారు. బీపీ తక్కువ కావడంతో హుటాహుటిన వెంటనే ఆయనను అత్యవసర చికిత్స నిమిత్తం బి.ఆర్.డి అంబులెన్స్‌లో కేసీ ఆస్పత్రికి తరలించారు. తారకరత్నను ఆసుపత్రిలో నందమూరి బాలకృష్ణ పరామర్శించారు. అక్కడ అత్యవసర చికిత్స అందించిన అనంతరం, కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రికి తరలించి, ఐసీయూలో వెంటిలేటర్ మీద అత్యవసర చికిత్సను అందించారు. హృదయానికి సంబంధించిన ఆరోగ్య సమస్యను గుర్తించిన వైద్యులు అత్యవసర చికిత్సలో భాగంగా యాంజియోగ్రాం చేశారు. అనంతరం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయినప్పటికీ తారకరత్న ఆరోగ్య పరిస్థితిపై ఉత్కంఠ కొనసాగుతోంది. పీఈఎస్ ఆసుపత్రిలో తారకరత్నకు అత్యవసర చికిత్సలో భాగంగా వైద్యులు స్టెంట్ వేశారు. అనంతరం బెంగళూరు నారాయణ హృదయాలయ నుంచి పీఈఎస్‌కు ప్రత్యేక నిపుణులైన వైద్యులను రప్పించి తారకరత్న పరిస్థితిపై నివేదిక తీసుకున్నారు. తారకరత్న ఆరోగ్య పరిస్థితిని ఫోన్‌లో చంద్రబాబు, జూనియర్ ఎన్టీఆర్, బంధువులు తెలుసుకున్నారు. కుప్పం బహిరంగ సభ అనంతరం పీఈఎస్ ఆసుపత్రికి వెళ్లిన లోకేశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్నను. ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. తారకరత్నను బెంగుళూరు మణిపాల్ ఆస్పత్రికి తరలించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. అయితే తారక రత్న కుటుంబసభ్యులు కుప్పం వస్తున్నట్లు సమాచారం.

BOARD OF INTERMEDIATE EDUCATION, A.P.
Eswar Elite, Beside Sonovision Showroom, Tadepalli, Guntur.

Rc. No. 21/D/2022-23 Date: 27-01-2023

SHORT TENDER NOTICE

The Secretary, BIE, AP invites Tenders from 'A' class web offset printers certified by the Commissioner of Printing, Stationery & Stores Purchases, Andhra Pradesh, located in the state of Andhra Pradesh, for Printing & Transportation of Miscellaneous Items with 60 GSM White Paper to all the districts. Head Quarters in Andhra Pradesh for the year 2022-23. The Participants can visit web site https://bie.ap.gov.in for details. Sd/- M.V. Seshagiri Babu, I.A.S., Secretary

కుప్పాన్ని పట్టించుకోని చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం ఇంకా వెనుకబడి ఉండటానికి తారకరత్న ఉదంతం తెలియజేస్తోందని వైసీపీ బీసీ నాయకులు డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... గుండెపోటుతో కుప్పం ఆసుపత్రికి తారకరత్న చేరుకున్నప్పటికీ... మెరుగైన వైద్యం కోసం పక్క రాష్ట్రాల వైపు చూసే దుస్థితిలో ఆ నియోజకవర్గ ఉందని తెలిపారు. రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో ఉన్నత స్థాయిలో నిలిపినట్లు డప్పుకొట్టుకుంటున్న చంద్రబాబు...సొంత నియోజకవర్గాన్ని ఎంత అభివృద్ధి చేశారో అర్థమవుతోందని పేర్కొన్నారు. సీఎంగా సుదీర్ఘకాలం పాలించిన చంద్రబాబు తన సొంత నియోజకవర్గంలో సరైన వైద్య సదుపాయాలు కల్పించలేకపోయారని, ఇప్పుడు రాష్ట్రమంతా అభివృద్ధి చేస్తానని ప్రచారం చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు.

భార్య, అత్తను నరికి చంపిన కిరాతకుడు

విశాలాంధ్ర-పెద్దకడబూరు: కర్నూలు జిల్లా జాలవాడిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. నాగరాజు అనే వ్యక్తి తాగిన మైకంలో భార్య శాంతి, అత్త భీమక్కను వేటకొడవలితో నరికి హత్య చేసిన సంఘటన శుక్రవారం పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటనతో ఆ గ్రామం ఉలిక్కిపడింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు నాగరాజు మద్యానికి బానిసై రోజూ మద్యం తాగి ఆస్తి కోసం భార్య శాంతితో గొడవ పడి కొట్టేవాడు. శాంతి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో వంట పని చేసేది. ఆదోనికి చెందిన భీమక్క మనవరాలికి తట్టుపోసిందని సద్ది తీసుకొని వచ్చింది. రోజూ మాదిరిగానే నాగరాజు మద్యం సేవించి ఇంటికి వచ్చి గురువారం రాత్రి భార్య శాంతితో గొడవ పడ్డాడు. మద్యం మత్తులో ఉన్న నాగరాజు ఇంటిలో ఉన్న వేటకొడవలితో భార్య శాంతిని, అడ్డు వచ్చిన అత్త భీమక్కను అతి దారుణంగా నరికి హత్య చేశాడు. తన ఇద్దరు కుమారులు, కూతురును ఒక గదిలో ఉంచి గడియపెట్టాడు. ఉదయం పిల్లల అరుపులు వినిపించడంతో చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా శాంతి, భీమక్క రక్తపు మడుగులో ఉండడం చూసి విస్మయం చెందారు. ఇద్దరి హత్యతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

బస్సుయాత్ర జయప్రదం చేయండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు: ప్రత్యేక హోదా సాధన కోసం యువజన, విద్యార్థి సంఘాలు అనంతపురం నుంచి చేపట్టిన బస్సుయాత్ర శనివారం గుంటూరు నగరానికి చేరుకుంటున్నది. ఈ బస్సుయాత్రకు ఘనస్వాగతం పలికేందుకు సమాయత్తం కావాలని శుక్రవారం మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. బస్సుయాత్ర మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరుకు చేరుకుంటుం దని, పాతబస్టాండ్ వద్ద గల చందన బ్రదర్స్ నుంచి ఏసీ కళాశాల వరకు భారీ పాదయాత్ర, అనంతరం కళాశాలలో బహిరంగసభ నిర్వహించనున్నట్లు సమావేశం తెలియజేసింది. సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ సహా అనేక పార్టీల నాయకులు, విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు వివరించింది. ప్రదర్శన, బహిరంగసభలో భాగస్వాములు కావాలని ప్రజలకు రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీల అమలు కోసం ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి గుంటూరు జిల్లా శాఖ అధ్వర్యంలో మల్లయ్యలింగం భవన్ వీఎస్‌కే హాలులో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు హాజరయ్యాయి. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, టీడీపీ నాయకుడు నాయుడు ఓంకార్, సమితి జిల్లా ఉపాధ్యక్షుడు తాటికొండ నరసింహారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు తదితరులు మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమ సాధనలో విద్యార్థి, యువజనులు కీలక పాత్ర పోషించారని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే బాధ్యతను తమ భుజ స్కంధాలపై వేసుకుని విద్యార్థులు, యువత యాత్ర చేపట్టడం హర్షణీయమని నాయకులు పేర్కొన్నారు. ఇది మలి దశ పోరాటానికి ఆరంభమన్నారు. హోదా, విభజన హామీలపై ప్రధాని మోదీ మాటతప్పారని, కేంద్రం మెడలు వంచుతానన్న సీఎం జగన్ భయ పడుతున్నారని విమర్శించారు. చట్టంలో పొందుపరచిన అంశాలను మాత్రమే అమలు చేయా లని కోరుతున్నామని స్పష్టం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాసర్ జీ, ఏఐవైఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్కే వలి, జంగాల చైతన్య, డీఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కిరణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు బీవీ చంద్రశేఖర్ రావు ప్రసంగించారు. తొలుత సమితి నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి వక్తలకు స్వాగతం పలుకగా సీపీఐ జిల్లా నాయకులు ముప్పాళ్ల శివశంకర్‌రావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఆరేటి రామారావు, సీపీఐ నగర నాయకులు దేవానాయక్, ఆకిటి రామచంద్రుడు, విజయ్‌కుమార్, నూతలపాటి చిన్న, జనసేన నాయకులు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫారం-బి

బహిరంగ ప్రకటన

(ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిక్విడేషన్ ప్రోసెస్) రెగ్యులేషన్స్ 2016లోని రెగ్యులేషన్ 12 క్రింద)

మెసర్స్ సర్దా అగ్రో ఆయిల్స్ లిమిటెడ్ యొక్క స్టేక్‌హోల్డర్స్‌కు గమనిక

సంబంధిత వివరములు		
1.	కార్పొరేట్ డెటార్ పేరు	మెసర్స్ సర్దా అగ్రో ఆయిల్స్ లిమిటెడ్
2.	కార్పొరేట్ డెటార్ నమోదు తేదీ	21-07-1992
3.	కార్పొరేట్ డెటార్ క్రింద ఇన్‌కార్పొరేషన్/ నమోధిత అధారిటీ	రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ (ROC) - హైదరాబాద్
4.	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ ఐడెంటిటీ నెంబరు/లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నెంబరు	U15143TG1992PLC014547
5.	కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయము మరియు ప్రధాన కార్యాలయము (ఏదైనా ఉంటే) యొక్క చిరునామా	655, సత్రమై, గగన్‌పహడ్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా
6.	దివాల తీర్మాన ప్రక్రియ ముగింపు తేది.	08-01-2023
7.	కార్పొరేట్ డెటార్ యొక్క లిక్విడేషన్ ప్రారంభ తేది.	09-01-2023 (ఆర్డర్ అందుబాటులోకి వచ్చిన తేది. 25-01-2023)
8.	లిక్విడేటర్‌గా వ్యవహరిస్తున్న దివాల నిపుణుని పేరు మరియు నమోదిత నెం.	మధుసూధన్‌రావు గోనుగుంట మరియు IBBI Regd No.IBBI/IPA-001/IP-P00181/2017-18/10360
9.	బోర్డు వద్ద నమోదైన లిక్విడేటర్ యొక్క చిరునామా మరియు ఇ-మెయిల్	7-1-285, ఫ్లాట్ నెం.103, శ్రీ సాయి స్వప్న సంపద అపార్ట్‌మెంట్స్, బల్కంపేట, సంజీవ్ రెడ్డినగర్, హైదరాబాద్, తెలంగాణ-500038 ఇ-మెయిల్ : madhucs1@gmail.com
10.	లిక్విడేటర్‌తో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుటకు చిరునామా మరియు ఇ-మెయిల్	7-1-285, ఫ్లాట్ నెం.103, శ్రీ సాయి స్వప్న సంపద అపార్ట్‌మెంట్స్, బల్కంపేట, సంజీవ్ రెడ్డినగర్, హైదరాబాద్, తెలంగాణ-500038 ఇ-మెయిల్ : sardairp @gmail.com (ప్రోసెస్ నిర్దిష్ట అన్ని క్లెయిములు & సంబంధిత ఈ మెయిల్ ఐడికి మాత్రమే పంపాలి)
11.	క్లెయిమ్స్ దాఖలు కొరకు ఆఖరి తేది.	23-02-2023

ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా సర్దా అగ్రో ఆయిల్స్ లిమిటెడ్ యొక్క లిక్విడేషన్ ప్రక్రియ ప్రారంభించుటకు తేది.09-01-2023న నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ వారు ఉత్తర్వులు జారీచేసినారు. (ఆర్డర్ అందుబాటులోకి వచ్చిన తేది.25-01-2023)

ఐటమ్ నెం.10, పైన తెలిపిన చిరునామా వద్ద లిక్విడేటర్‌కు తేది. 23-02-2023న లేదా అలోగా రుజువులతో సహా తమ క్లెయిమ్స్ దాఖలు చేయవలసినదిగా సర్దా అగ్రో ఆయిల్స్ లిమిటెడ్ యొక్క స్టేక్ హోల్డర్స్‌ను కోరడమైనది.

ఫైనాన్షియల్ క్రెడిటార్లు వారి క్లెయిములను ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే రుజువులతో దాఖలు చేయవలెను. ఇతర క్రెడిటార్లు అందరూ స్వయంగా లేదా తపాలా ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానంలో రుజువులతో క్లెయిమ్‌లు దాఖలు చేయవచ్చును.

తప్పుడు సమాచారం లేదా అసంబద్ధ సాక్ష్యములు దాఖలు చేసినచో జరిమానాలు విధించబడును.

లిక్విడేటర్ పేరు మరియు సంతకం
సం/- మధుసూధన్ రావు గోనుగుంట
IBBI Regd No.IBBI/IPA-001/IP-P00181/2017-18/10360
AFA చెల్లుబాటు తేది. 09-10-2023 వరకు
ఫోన్ : 8074633502 & 9177715558

తేది. : 28-01-2023
ప్రదేశం : హైదరాబాద్

సంపాదకీయం

కూలుతున్న అదానీ పేక మేడ

స్టాక్ మార్కెట్టే ఒక మాయ. అందులో అదానీ లాంటి మహా మాయగాళ్లు ఎన్ని కుప్పిగంతులైనా వేయగలరు. కానీ అడుగులేని ముంతలు ఎల్లకాలం నిలబడడం అసాధ్యం అన్న అంశం అదానీ విషయంలో రుజువైంది. అదానీ అధీనంలోని కంపెనీల బండారాన్ని అమెరికాలోని హిండెన్‌బర్గ్ పరిశోధనా సంస్థ ఇటీవలే బయటపెట్టింది. అదానీ కంపెనీల వాటాల ధరలను 85శాతం దాకా ఎక్కువచేసి చూపిస్తున్నారని ఈ పరిశోధక సంస్థ తేల్చేసిన తరవాత అదానీ కంపెనీల వాటాల పతనం ప్రారంభమైంది. ఆయన కంపెనీల వాటాల ధరలు శుక్రవారం 20శాతం దాకా పడిపోయాయి. అదానీ టోటల్ గ్యాస్‌షేర్ల ధరలు 19.65శాతం, అదానీ ట్రాన్స్‌మిషన్ వాటాల ధరలు 19శాతం, అదానీ గ్రీన్‌ఎనర్జీ వాటాలు 15.50శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ వాటాల ధరలు 6.19శాతం తగ్గిపోయాయి. అదానీ రేవుల కంపెనీ, ప్రత్యేక ఆర్థిక మండళ్ల విభాగం వాటాల ధరలుకూడా గణనీయంగా తగ్గాయి. అదానీ పవర్ వాటాలు 4.99శాతం తగ్గాయి. అన్ని కీలకమైన రంగాలు మోదీ దయవల్ల అదానీ గుప్పెట్లో ఉన్నాయి. రేవులు, ఖనిజాల తవ్వకం, విమానయానం మొదలైన సకల రంగాలలో అదానీ గాలే వీస్తోంది. అదానీ అధీనంలోని ఏ కంపెనీల వాటాలు కుప్పకూలుతున్నాయన్న అంశంతో సంబంధం లేకుండా, దేశంలోకెల్లా కుబేరుడు అనుకుంటున్న ఆసామీ కాళ్లకింద నేలజారిపోవడం భారత ఆర్థికవ్యవస్థకే విఘాతం కలిగించే ప్రమాదం పొంచిఉంది. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరవాత గుజరాత్‌కు చెందిన అదానీ సకల వ్యాపార, పారిశ్రామిక రంగాలపై ఆధిపత్యం సంపాదించారు. అతి కొద్ది కాలంలోనే దేశంలో అత్యంత సంపన్నుడైన ముఖేశ్ అంబానీ సంపదను తలదన్నే స్థితికి అదానీ చేరుకున్నారు. ప్రపంచ కుబేరుల జాబితాలో అదానీ గబగబా అనేక మెట్లు ఎక్కేశారు. హిండెన్‌బర్గ్ పరిశోధనా సంస్థ వెల్లడించిన అంశాలలో నిజం ఎంతో తెలియదు కానీ, ఆ నివేదిక మాత్రం అదానీ వ్యాపార సామ్రాజ్యానికి శరాఘాతం అయింది. అదానీ కంపెనీలు బలహీన పడడంతో బొంబాయి స్టాక్‌ఎక్స్‌ఛేంజిలో అగ్రగామి 30వాటాలు 1.84శాతం లేదా 1,106పాయింట్ల మేర పడిపోయాయి. దీని ప్రభావం ఆర్థిక కంపెనీలు, బ్యాంకింగ్, చమురు, సమాచార, సాంకేతిక కంపెనీల వాటాల ధరలపై కూడా స్పష్టంగా కనిపిస్తోంది. టాటా మోటార్స్, బజాజ్ ఆటో మాత్రమే కొంతమేరకు ఈ పతనాన్ని తట్టుకుని నిలబడ్డట్టు కనిపిస్తోంది. తమ బండారం బయట పెట్టిన హిండెన్‌బర్గ్ పరిశోధనా సంస్థపై సహజంగానే అదానీ కంపెనీల సముదాయం కారాలు మిరియాలు నూరుతోంది. హిండెన్‌బర్గ్ సంస్థపై చర్య తీసుకునే మార్గాలు అన్వేషిస్తున్నామని చెప్తోంది.

గత మూడు రోజుల కింద వెలువడిన హిండెన్‌బర్గ్ సంస్థ నివేదికకు ఏ పరిశోధనా ప్రాతిపదిక లేదని, అది దురుద్దేశంతో కూడిందని దీనివల్ల తమ కంపెనీలపై ప్రతికూల ప్రభావం పడిందని, వాటాదార్లు, పెట్టుబడి పెట్టేవారు విచలితులవుతున్నారని, స్టాక్‌మార్కెట్‌లో ప్రకంపనలు మొదలయ్యాయని అదానీ గ్రూప్ కంపెనీల ఉన్నతాధికారి జలంధ్ వాలా ఆక్రోశిస్తున్నారు. హిండెన్ బర్గ్ సంస్థ ఏ మాత్రం తొణకడం లేదు. తమ నివేదికలో పేర్కొన్న విషయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటిస్తోంది. అదానీ షేర్ మార్కెట్లో మాయచేసిన విషయం వాస్తవం అంటోంది. అదానీ కంపెనీల వాటాల విలువ తగ్గిపోతే హిండెన్ బర్గ్ కంపెనీకి ప్రయోజనం కలుగుతుందన్న వాదనా వినిపిస్తోంది. ఈ విదేశీ సంస్థ పరిశోధించి రూపొందించామని చెప్తున్న నివేదిక పెట్టుబడిపెట్టే వారిని గందరగోళంలో పడేస్తోందని, తమ కంపెనీలమీద ఉన్న విశ్వాసం సడలేట్టు చేస్తోందని, తమ ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని జలంధ్ వాలా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అమెరికా, భారత చట్టాల ఆధారంగా హిండెన్ బర్గ్ కంపెనీ మీద ఏం చర్య తీసుకోవడానికి వీలుందో పరిశీలిస్తున్నామని జలంధ్ వాలా అంటున్నారు. అదానీ, హిండెన్‌బర్గ్ మధ్య వివాదం అంతిమ ఫలితం ఏమైనా చాలాకాలం నుంచి అదానీ షేర్ మార్కెట్లో మాయ చేస్తున్నారని మాత్రం స్పష్టంగా రుజువు అవుతూనే ఉంది. ఏ మాయ లేకపోతే మోదీ అధికారంలోకి వచ్చే దాకా ఊరు, పేరు లేని అదానీ ఒక్క సారి కీర్తిశిఖరాలు ఎలా అధిరోహిస్తారన్న ప్రశ్న సహజంగానే ఎదురవుతుంది.

హిండెన్ బర్గ్ సంస్థ అదానీ గురించి నిర్ఘాంతపోయే సమాచారం వెల్లడించిన 36గంటల తరవాత కూడా అదానీ గ్రూపు పెదవివిప్పలేని స్థితిలో పడిపోయింది. మరో వేపు తమమీద ఏ చర్య తీసుకున్నా అది వృథా ప్రయాసేనని, చట్టపరంగా అమెరికాలో ఏ కేసు మోపినా దాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని హిండెన్ బర్గ్ సంస్థ ధీమాగా ఉంది. తాము చేసిన ఆరోపణలలో ఒక్కదానికి కూడా అదానీనుంచి తగిన సమాధానం ఏదీ రాలేదంటోంది. హిండెన్ బర్గ్ కంపెనీ నివేదికలో చివర 88ప్రశ్నలు సంధించామని వీటిలో ఒక్కదానికీ సమాధానం లేదంటోంది. ప్రపంచంలోకెల్లా సంపన్నుల్లో మూడవస్థానంలో ఉన్న అదానీపై హిండెన్‌బర్గ్ ఇంత తీవ్రమైన ఆరోపణలు చేసిందంటే అవి పూర్తిగా నిరాధారమైనవని అనుకోలేం.

తమను సంప్రదించకుండానే హిండెన్‌బర్గ్ సంస్థ నిరాధార ఆరోపణలు గుప్పించిందన్న అదానీగ్రూపు వాదనచూస్తే ఆ సంస్థ దిక్కుతోచనిస్థితిలో పడిపోయినట్టే కనిపిస్తోంది. అదానీ ఆస్తులు ఎంతఎక్కువైనా, సంపద ఎంత ఎక్కువ అనుకున్నా ఆయన అప్పులూ తక్కువేమీ లేవు. ఈ అప్పులన్నీ ఎక్కువగా బ్యాంకుల దగ్గర తీసుకున్న రుణాలే అయిఉంటాయి కనక వచ్చిన ఆరోపణలు నిజమైతే అప్పులిచ్చిన బ్యాంకుల గతి ఏమిటన్నది అసలు ప్రశ్న. హిండెన్ బర్గ్ చేసిన ఆరోపణల నిగ్గు తేలాలంటే సెబి, రిజర్వుబ్యాంకు లోతైన దర్యాప్తు చేయవలసిన అవసరమైతే ఉంది. రెండేళ్లకింద కరోనా కాటేసిన స్థితిలో జరిగిన ఆర్థికనష్టం నుంచి దేశ ఆర్థికవ్యవస్థ ఇప్పటికీ తేరుకోలేదు.

ఆర్థిక వ్యవస్థ ఇంత శాతం పుంజుకుంటోంది, అంత శాతం పుంజుకుంటోంది అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ చెప్తున్నమాట వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉంది. జనం కరోనాతో అల్లాడిపోతున్నప్పుడు, లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోయినప్పుడు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నీరుగారినప్పుడు అదానీ, అంబానీల ఆస్తులు మాత్రం విపరీతంగా పెరిగిపోయాయి. ఈ రెండు వ్యాపార సంస్థలకు మోదీ ప్రభుత్వం అండగా ఉందన్న విషయంలో అనుమానమే అక్కర్లేదు. మోదీ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలు సామాన్యజనాన్ని కుదేలు చేసేశాయి. సంపద కొద్ది మంది చేతుల్లో పోగుపడకుండా చూడవలసిన బాధ్యత రాజ్యవ్యవస్థదే అన్న రాజ్యాంగ ఆదేశికసూత్రాన్ని మోదీ ప్రభుత్వం బేఖాతరు చేస్తూనేఉంది. అదానీ నష్టం దేశ వాసులను కలవరపరచక మానదు.

ఉమ్మడి కరెన్సీ దిశగా లాటిన్ అమెరికా

సాత్యకి చక్రవర్తి

లాటిన్ అమెరికాలో ఉమ్మడి కరెన్సీని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అదే సమయంలో, లాటిన్ అమెరికా దేశాల మధ్య పూర్తి ఆర్థిక ఐక్యతను సాధించాలని కూడా బ్రెజిల్, అర్జెంటైనా అధ్యక్షులు సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అర్జంటైనా వెబ్‌సైట్ పెరిఫిల్ ఇద్దరు అధ్యక్షుల సంయుక్త ప్రకటనను వెల్లడించింది. ఈ రెండు నిర్ణయాలపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లూలా డ సిల్వా, అర్జంటైనా అధ్యక్షుడు అల్బర్టో ఫెర్నాండజ్ గట్టి నిర్ణయం తీసుకున్నారు. జనవరి ప్రారంభంలోనే ఉమ్మడి కరెన్సీ, ఆర్థిక ఐక్యతపై ఇరువురు నాయకులు ఒక అవగాహనకు వచ్చారు. లాటిన్ అమెరికాలోని అనేక దేశాలలో వామపక్ష భావజాలంగల ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. ఆయా దేశాల్లో ఉన్న కరెన్సీల మధ్య ఉన్న అడ్డుగోడలను తొలగించి, స్థానిక కరెన్సీలను వినియోగానికి వీలుగా సరళమైన, ఆధునిక కరెన్సీని ప్రవేశపెట్టాలని రెండు దేశాల నేతలు నిర్ణయించారు. ఉమ్మడి కరెన్సీపై చర్చలు కొనసాగించాలని, అన్నిదేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలు పురోగమించినట్లయితే నిర్వహణ వ్యయం తగ్గి అంతర్జాతీయ కార్యకలాపాలు బలపడతాయని నాయకులిద్దరూ ప్రకటించారు.

ప్రస్తుతం బ్రెజిల్ ఆర్థికమంత్రిగాఉన్న ఫెర్నాండో హద్దాడ్, ఆర్థికశాఖ ఎగ్జికూటివ్ కార్యదర్శి గాబ్రియెల్ గలిపోలోలు కలిపి ఉమ్మడి కరెన్సీ అవసరాన్ని ఒక వ్యాసం ద్వారా వ్యక్తం చేశారు. గత ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ప్రచారసభల్లో లూలా మాట్లాడుతూ, లాటిన్ అమెరికాలో ఉమ్మడికరెన్సీ ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అమెరికా డాలర్‌పై ఆధారపడడం తగ్గించి, ప్రాంతీయ వాణిజ్య పెంపుదలకు ఉమ్మడి కరెన్సీ ఉపయోగపడుతుందని లూలా పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై ఆలోచించి చర్చించేందుకు ఇతర లాటిన్ అమెరికా దేశాలను కూడా లూలా ఆహ్వానించారు. ఉమ్మడి కరెన్సీతో నూతనంగా ఆవిర్భవించే ద్రవ్య సంఘటన యూరోకరెన్సీని కూడా అధిగమిస్తుందని భావిస్తున్నారు. బ్రెజిల్ ప్రపంచంలోనే ఏడో పెద్ద దేశం. బ్రెజల్, అర్జంటైనా కలిస్తే మూడువందల మిలియన్ల ప్రజలు ఉంటారు. ప్రస్తుతం బ్రెజిల్‌లో 'రెల్' కరెన్సీ వినియోగంలోఉంది. కొత్త కరెన్సీ 'సర్'(దక్షిణం) అనే పేరు పెడితే బాగుంటుందని భావిస్తున్నారు. కొత్త కరెన్సీవల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఆకాంక్షిస్తున్నారు. ఉమ్మడి కరెన్సీ ప్రవేశపెట్టేందుకు అవసరమైన నియమనిబంధనలను అధ్యయనం చేసేందుకు దక్షిణ అమెరికా దేశాలన్నీ త్వరలో సమావేశం కానున్నాయని అర్జంటైనా ఆర్థికమంత్రి సెర్జియో మస్సా విలేకరులకు తెలిపారు. ద్రవ్య సంబంధమైన అనేక అంశాలు ఉదాహరణకు ఆర్థికప్రమాణం, సెంట్రల్ బ్యాంకులపాత్ర తదితరఅంశాలను చర్చించనున్నారని ఆయన వెల్లడించారు. ఇది మొదటి చర్యే అవుతుందని, పూర్తిఫలితం రావడానికి దీర్ఘకాలం పడుతుందని ఆయన చెప్పారు. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలు బ్యునస్‌ఎయిర్స్‌లో సమావేశమై ఉమ్మడి కరెన్సీ ప్రణాళికపైన చర్చించారు. 2019లోనే లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలు ఈ అంశాన్ని చర్చించాలని ప్రయత్నించినప్పటికీ బ్రెజిల్ పూర్వపు అధ్యక్షుడు జైర్ బొల్సొనరో అభ్యంతరం పెట్టడంతో అది ఆగిపోయింది. పైగా క్యూబా, వెనిజులా దేశాల ప్రతినిధులు పాల్గొనడాన్ని ఆయన వ్యతిరేకించారు.

అర్జంటైనాకు చెందిన ఆర్థికవేత్త, భౌగోళిక, రాజకీయాల వ్యూహాత్మక కేంద్రం డైరెక్టర్ అయిన అల్‌ఫ్రెడో సెర్రనో మంక్ మాట్లాడుతూ, అవలంబించాలనుకున్న పంథాలో డాలర్‌కు బదులుగా ఉమ్మడి కరెన్సీని ప్రవేశపెట్టేందుకు వివిధ యంత్రాంగాలను ఆలోచించి రూపం తీసుకోవలసి ఉంటుందన్నారు. లాటిన్ అమెరికాలో అనేక దేశాలు ఒకే విధమైన భావజాలంతో ఉన్నందున ఈ ప్రయత్నం మంచిదేనన్నారు.

బ్రెజిల్‌లో ఓటమిపాలైన బొల్సొనారో అమెరికాలో తిష్టవేసి తన అనుచరులను లూలాపై తిరుగుబాటుకోసం రెచ్చగొడుతున్నారు. ఇటీవల బొల్సొనరో అనుచరులు సుప్రీంకోర్టు అధ్యక్ష భవనంపై దాడిచేసి విధ్వంసం సృష్టించారు. అంతేకాదు, లూలా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు సైన్యం సహాయాన్ని కూడా కోరారు. అనంతరం లూలా మద్దతుదారులు భారీ ప్రదర్శనచేసి బొల్సొనరో అనుచరులను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. అయితే బొల్సొనరో మౌనంగా ఉండే వ్యక్తి కాదని, రకరకాల వ్యూహాలు పన్నుతున్నారని వార్తలు అందుతున్నాయి. లాటిన్ అమెరికాలోని పెరూ అధ్యక్షుడు పెడ్రో కాజిలోను కుట్ర పన్ని అవినీతి ఆరోపణలపై పదవినుంచి తొలగించి అరెస్టు చేశారు. ఉపాధ్యక్షుడు బినాబొలుర్టి అధ్యక్ష పదవిని చేపట్టారు. అర్జంటైనాలో ఉపాధ్యక్షురాలు కిచెనర్‌ను కూడా అవినీతి ఆరోపణలపై అరెస్టు చేశారు. అర్జంటైనా ఆర్థిక సంక్షోభం నుంచి ఇంకా కోలు కోలేదు. అర్జంటైనా గతంలో వివిధరంగాలలో భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకున్నది. ప్రస్తుతం బ్రెజిల్‌తోనూ ఆర్థిక సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేస్తున్నది.

లాటిన్ అమెరికాలోని అనేక వామపక్ష దేశాలు అన్నివిధాలుగా పటిష్ఠమయేందుకు కృషిచేస్తున్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా గతంలో రెండుసార్లు అధ్యక్షుడుగా పనిచేసి అపారమైన అనుభవాన్ని, ప్రజాదరణను పొందారు.

ఈ నేపథ్యంలో ఆయన వామపక్ష దేశాలమధ్య ఆర్థిక ఐక్యత, ఉమ్మడికరెన్సీ లక్ష్యాల సాధనకు గట్టిగా కృషిచేస్తున్నారు. ఉమ్మడి కరెన్సీ ఆవిష్కరణ జరిగితే బ్రెజిల్ ఆర్థికవ్యవస్థ కూడా గణనీయంగా కుదుటపడుతున్నది. కొవిడ్ మహమ్మారి కారణంగా బ్రెజిల్ ఆర్థికవ్యవస్థ కుదేలైపోయింది. ఈ నేపథ్యంలో అధికారానికి వచ్చిన లూలా పరిస్థితిని చక్కబరుస్తారనే అంచనాలు మెండుగా ఉన్నాయి. 2023లో సూక్ష్మ ఆర్థిక పరిస్థితి, భౌగోళిక రాజకీయ వాతావరణం మెరుగుపడే అవకాశాలు తక్కువగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. పైగా 2023లో వృద్ధిరేటు 1.7శాతం తగ్గవచ్చునని నిపుణుల అంచనా. లాటిన్ అమెరికా దేశాలలో రాజకీయ ఉద్రిక్తతలు కలిగే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అర్జంటైనాలో 2023 అక్టోబరులో ఎన్నికలు జరుగనున్న తరుణంలో, ప్రస్తుత పరిస్థితిని మరింత మెరుగుపరచుకుని ఎన్నికల్లో గెలవడానికి పాలక ఫ్రంట్ గణనీయంగా కృషిచేయవలసి ఉంటుందని భావిస్తున్నారు.

వృద్ధిలో చైనాకి భారత్ ప్రత్యామ్నాయమవుతుందా?

ఇటీవల జపాన్ ప్రధాని అమెరికా పర్యటన అనంతరం, అమెరికా ప్రధాన వాణిజ్యభాగస్వామిగా జపాన్ని ఉభయదేశాలు పరిగణిస్తున్నాయి. కానీ కొందరు విశ్లేషకులు అమెరికాకి జపాన్ కన్నా, భారతదేశంతోనే పటిష్ఠమైన సంబంధాలున్నందున ఇండో పసిఫిక్ ప్రాంతంలో భవిష్యత్తు అంతా భారత్ చేతుల్లో ఉన్నట్లుగా అంచనా వేస్తున్నారు. గత ఆర్థిక చరిత్ర అంతా భారత్, చైనాలకు సంబంధించినదిగా ఉండేది. ప్రపంచ బ్యాంకు మారక డాలర్ విలువతో 1980లలో భారత్ జీడీపీ చైనా జీడీపీలో 60శాతం. 2001లో చైనా ప్రపంచ వాణిజ్య సంస్థలో(డబ్ల్యూటీవో) చేరింది. అప్పటికి భారత్ జీడీపీ చైనాతో పోల్చితే 28శాతం. అనేక సంవత్సరాల అనంతరం 21 శతాబ్దంలో వేగవంతంగా వృద్ధి చెందినా, 2021 నాటికి మరింత దిగజారి చైనాతో పోల్చితే అది 17శాతం మాత్రమే. జనాభాలో చైనాతో పోటీపడినా, అధిగమించనున్నా, ప్రపంచ స్థాయి సైబర్ పరిశ్రమ వృద్ధి చెందినా తయారీరంగంలో మాత్రం చైనా అగ్రగామిగా ఉంటూ ఆసియాలోనే గాక ప్రపంచంలోనే సుస్థిరమైంది. భారత్ వెనుకబడింది.

అసమతుల్య వృద్ధి ఆధునిక రాజకీయ చోదక శక్తిగా ఆధునిక ప్రపంచ రాజకీయాలన్నింటినీ నడిపిస్తోంది. ఇది అనేకుల అవగాహన సామర్థ్యం మించి ఉంది. తొలినాళ్లలో బ్రిటన్ తన పారిశ్రామిక విప్లవంతో ఏకకాలంలో తయారీలో ప్రపంచ స్థాయి అధినేతగా 19వ శతాబ్దంలో గుర్తింపు పొందింది. మిగతా ఐరోపా బ్రిటన్‌తో గల అనుసంధానంతో పాశ్చాత్య ఆధిపత్యం విశ్వవ్యాప్తమైంది. జపాన్ పారిశ్రామిక ఆరంభ విజయాలతో 19వ శతాబ్దం చివరికి ఆసియాలోని గొప్ప శక్తిమంత సామ్రాజ్యంగా రూపొందింది. కొన్నిసార్లు దాన్ని(బ్రిటన్ ఏషియా) ఆసియా బ్రిటన్‌గా పిలిచారు. ఈ ప్రాంతీయ ఆధిక్యత వారి తలకెక్కింది. తల బిరుసుతనం పెరిగింది. అది నిర్మూలన దిశగా సామ్రాజ్యవాదంగా పరిణమించింది. ఆధిపత్యానికై అంగలార్చింది. తహతహలాడింది. తగు రీతిలో పరిణామాలు చవిసూసింది. ప్రస్తుతం జపాన్ స్థానంలో అదే రీతిలో చైనా ఆవిర్భవించింది. ప్రాంతీయ ఆధిపత్యానికై ప్రయత్నాలు నిరంతరం చేస్తూనే ఉంది.

గత 40 సంవత్సరాలలో భారత్ కూడా చైనా లాగా వృద్ధిరేటు సమంగా సాధించగలిగి ఉంటే అది పది ట్రిలియన్ల డాలర్లకు చేరి ఉండేది. ప్రస్తుత 2.73 ట్రిలియన్లకు బదులుగా, ఈ స్థాయి ఆర్థిక వ్యవస్థలో ఇక్కడి సైనిక వ్యయం పరిగణించినప్పుడు కొందరు దౌత్య, ఆర్థికవేత్తలు ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రమాదం ఏమీ లేదు అంటున్నారు. ఈ రెండు దేశాల మధ్య నెలకొన్న అంతరాలు ముగిస్తే అది ప్రాంతీయ ఆధిపత్యాల్లో మార్పుకు దారి తీస్తుంది. ఆసియాలో చైనా సంపన్నత అగ్రరాజ్యం అమెరికాకు సమస్య కాదు. వారి సమస్య అంతా భారత్ పేదరికంలో ఉండటమే. సమీప కాలంలో, మధ్యంతర కాలంలో ఆసియాలో పెద్ద దేశాల నడుమ అసమత్వం కారణంగా తమ పొత్తుదార్లతో కలిసి చైనా ఆకాంక్షల్ని, శక్తి సామర్థ్యాన్ని నియంత్రించ గలరా? వారి శక్తి కేంద్రీకరణ అంతా తాత్కాలికంగా గాక మరింతగా దీర్ఘకాల ప్రాతిపదికగా ఉండాలని కొందరు అక్కడ కోరుకుంటున్నారు. భారత్, అమెరికాలకు అనేక అంశాలలో పరస్పర అంగీకారం లేదు. ఉండకపోవచ్చు. కానీ అమెరికా జాతీయ ప్రయోజనాలు మాత్రం స్థిరంగా భారత వృద్ధితో ముడిపడి ఉన్నాయనేది కాదనలేని వాస్తవం.

భారత్ ఆర్థిక సామర్థ్యం ఇంతవరకు ప్రపంచస్థాయి సమాచార సాంకేతికతతో కూడుకొని ఉన్నది. బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాలు వీటికి కేంద్రాలైనా అంతిమంగా ఇవన్నీ నూతన ఉన్నత మధ్య తరగతి ఆవిర్భావానికి ప్రేరకాలైనాయి. అయితే సైబర్ సాంకేతికత ఒకటే భారత్‌కు అవసరమైన పురోభివృద్ధికి సరిపోదు. ఇక్కడ మన పేదరికం గణనీయంగా తగ్గాలన్నా, పూర్తి నిర్మూలన జరగాలన్నా అంతర్జాతీయ స్థాయి అభివృద్ధిదిశగా పయనించాలన్నా చైనా లాగా భారత్ కూడా ఒక గొప్ప 'తయారీ' శక్తిగా రూపొందాలి. ఏ సేవారంగం దీనికి ప్రత్యామ్నాయం కాబోవు. ప్రపంచ బ్యాంకు 2021లో అంచనా ప్రకారం, మన దేశంలో 360 మిలియన్ల పిల్లలు 14 సంవత్సరం లోపు వారు ఉన్నారు. వీరు చైనా కన్నా 112మిలియన్లు ఎక్కువ. ఐటీ రంగం వీరిలో బహు కొద్ది మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించగలదు. భారత్‌లోని కోట్లాది శ్రామికులు ఇంగ్లీష్ మాట్లాడలేరు. లెక్కల్లో పరిజ్ఞానం సాపేక్షికంగా తక్కువ. వీరందరికీ తగుశిక్షణతో పరిశ్రమల్లో పని, వివిధ రూపాల ఉపాధి కల్పనలు మాత్రమే దారిద్ర్య నిర్మూలన పరిష్కార మార్గాలు. పెట్టుబడిదారుల గుప్పెట్లో ప్రభుత్వాలు వీటికి ఎంతవరకు సుముఖంగా ఉంటాయనేది ప్రశ్నార్థకం.

ప్రపంచ మార్కెట్‌కు అనుగుణంగా తయారీరంగం సంసిద్ధత ప్రయత్నాలు మొదలు పెట్టటానికి ఇంత దాకా భారత్ పూనుకోలేదు. అరకొర మౌలిక సదుపాయాలు, అవిశ్వాసనీయమైన విద్యుత్ సరఫరా, ప్రేరకరాహిత్య అలసత్వ యంత్రాంగం, సంక్లిష్టచట్టాలు, సర్వత్రా రాజకీయజోక్యం, అవినీతి, బంధుప్రీతి, వ్యవస్థల్ని మించి వ్యక్తుల ప్రాబల్యం పెరగడం, సమస్త విలువల/నైతికత రాహిత్యం, ద్వంద ప్రమాణాలు, కీలక స్థానాల్లో వారికి దార్శనికతా లోపం, ఉన్నత స్థానాల్లో వారి నడుమ నిరంతరం పరస్పర సంఘర్షణ వైఖరి లాంటివి అనేకం ఆసియా పారిశ్రామికీకరణలో భారత్‌ని ముఖ్య భాగస్వామి కాకుండా నిరోధించాయి. జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, సింగపూర్, వియత్నాం, చైనాలు అన్నీ భారత్‌ని మించిపోయి పోటీలో ముందున్నాయి. భారత్‌కు ఇదంతా గతం అనుకున్నా ప్రస్తుతం దేశీయంగా, అంతర్జాతీయంగా సానుకూల అంశాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా అనేక దేశాలు చైనా ఆధారితాన్ని తగ్గించుకోవాలని చూస్తున్నాయి. ఇక్కడి ప్రభుత్వం కూడా సైబర్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుండి మరింత విస్తృతం కావాలని సంకల్పించిన సూచనలు కనిపిస్తున్నాయి. సంవత్సరాల తరబడి జాతీయ రహదారులు, రైల్, రోడ్స్, ఓడరేవులు లాంటి వాటిపై పెట్టుబడుల నియంత్రణలలో సవరణలు, సంస్కరణలు లాంటి వాటితో దీర్ఘకాల ఆటంకాలను తొలగించే దిశగా పయనిస్తున్నాయి. తద్వారా విదేశీ పెట్టుబడులు ఆకర్షించే అవకాశాలు మెరుగైనట్లు కనిపిస్తున్నాయి. ప్రజాబాహుళ్యంలో అత్యధికంగా ఎగుమతి వస్తూత్పత్తిని ప్రభుత్వం ప్రోత్సహిస్తే వృద్ధి సాధ్యమవుతుంది.

బి. లలితానందప్రసాద్(రిటైర్డ్ ప్రొఫెసర్)
సెల్: 9247499715

తెలుగు తెర 'బంగారు తల్లి'

ఒక్కొక్కరే వెళ్లిపోతున్నారు. ఇక మనమంతా "ఏవీ తల్లీ నిరుడు కురుసిన హిమ సమూహములు" అని వెక్కిళ్ల మధ్య వెదుకులాడుకోవాల్సిందే. తెరపై ఆత్మాభిమానికి పారితోషికాలుంటాయి. నిజ జీవితంలో ఆత్మాభిమానికి వెన్నుముకపై నిలబడడమే పారితోషికం. వయసు మీదపడుతున్న కొద్దీ వెన్నుముక అరిగిపోతుంది. మందులతోను, ఆపరేషన్లతోనూ వెన్నుముకను నిలబెట్టుకోవచ్చు కాని, ఆత్మాభిమానానికి ఎలాంటి మందులు వాడాలి. ఉండవు. దొరకవు. అది పుట్టుకతోవచ్చి తుది శ్వాసతో వెళ్లిపోతుంది. కానీ, ఆ రెంటి మధ్యన జరిగే ఓ ప్రయాణంలో మాత్రం వారిని మహనీయులుగా నిలబెడుతుంది. అలా ఆత్మాభిమానానికి ప్రతీక లాంటి నటి జమున వెన్నుముకే కవచంగా ధరించి నవ్వుతూ వెళ్లిపోయారు. చనిపోయిన వారి కళ్లు ఎప్పుడు చారెడే. ఆ కళ్లు బతికి ఉన్నప్పుడు కూడా చారెడుగా కనిపిస్తేనే కదా వారి జీవికకు అర్థం, పరమార్థం.

అవును... అలాంటి జీవికకు నకలు జమున నిలువెత్తు జీవితం.

"మీర జాలగలడా నా యానతి" అని జమున ప్రశ్నించింది ఎవరిని. సత్యభామ వేషంలో ఉన్న జమున శ్రీకృష్ణుని పాత్రలో ఉన్న ఎన్టీఆర్‌ని ప్రశ్నించలేదు. ఆనాటి, నేటి, ఏనాటికైనా తెలుగు సినీ రంగాన్నే ప్రశ్నించింది. వెండితెర జిలుగుల వెనుక నక్కినక్కి దాక్కుని పరిశ్రమని శాసిస్తున్న పురుషాహంకారాన్ని ప్రశ్నించింది. జవాబు దొరకకపోవచ్చు. ఎవరూ చెప్పకపోవచ్చు. తప్పించుకోవచ్చు. ఆ దారికే వెళ్లకపోవచ్చు. కానీ, జవాబు దొరకనంత మాత్రాన ప్రశ్నలు లేకుండా ఎలా పోతాయి. ప్రశ్నలు మరో రూపంలో, మరో నటిపేరుతో ఎదురవుతాయి. నేడు సినీరంగంలో ఎదురవుతున్న అనేకానేక ప్రశ్నలకు పునాది జమున నిలదీసిన ఆ ప్రశ్న.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

నటులుంటారు. గొప్ప నటులుంటారు. మహానటులూ ఉంటారు. మాయదారి సినీ పరిశ్రమలో తెరపై కంటే తెర వెనుక అనేకానేక మంది మహానటులకు మించిన వారూ ఉంటారు. కానీ, ప్రజా నటులు ఉంటారా. ప్రజా నటి ఉంటుందా. అసలు అలాంటి మాట ఒకటి ఉన్నదనే ఎరుక కలిగిన వారు ఎందరుంటారు. అవును, జమున అనే అహంకారపు నటి కొందరికే తెలుసు. ఆమె ప్రజానటి అనే మాట ఎంతమందికి తెలుసు. ఈ అహంకారం అనే మాటను ప్రయోగించి తమ అహంకారాన్ని నిలబెట్టుకున్న మహానటులున్నారు. గుండమ్మకథ సినిమాకు మూడేళ్లకు ముందే తమ అహంకారంతో జమునను బలవంతంగా నిషేధించిన వారే ఆమె ఆత్మాభిమానం ముందు ఓడిపోయారు.

ఓ నటి షూటింగ్ సెట్‌లో కాలు మీద కాలు వేసుకుని కూర్చోవడం ఓ అహంకారం. తోటి నటులను గౌరవించడం తప్ప అణిగి మణిగి ఉండక పోవడం మరో అహంకారం. అప్పటికే ఓ కులం తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న సమయంలో ఆ కులం కాని అమ్మాయి స్వశక్తితో ఎదుగు తూండడం ఇంకో అహంకారం. వారంతా అహంకారం అన్నారు... అనుకున్నారు... ప్రచారం చేసారు. కాని జమున మాత్రం తన పాటలోనే అన్నట్లుగా " మానూ, మాకును కాను. రాయి, రప్పను కానే కాను... మామూలు మడిసిని నేను. నీ మనిషిని నేను" అని చెప్పి జీవించినంత కాలం ప్రజల మనిషిగానే ఉన్నారు.

ఓ క్లాప్ బాయ్‌కి కష్టం వస్తుంది. మరో జూనియర్ ఆర్టిస్టుకి షూటింగ్‌లో జరిగిన ప్రమాదంలో కాలు విరుగుతుంది. ఇంకో లైట్ బాయ్‌కి షాక్ కొట్టి అతని జీవితంలో హఠాత్తుగా వెలుగులు కొల్పోయే పరిస్థితి వస్తుంది. ఆ సమయంలో వాళ్లకి దేవుడి మీద కోపం వస్తుంది. కడుపుకింత దొరకని స్థితిని తలచుకుని మోకాళ్ల మధ్య తలలు పెట్టుకుని భోరున ఏడవాల్సి వస్తుంది. అదిగో, అప్పుడు వాళ్లకి జమున గుర్తుకు రాదు. ఆమెకే వాళ్ల కష్టం తెలుస్తుంది. కృష్ణానగర్‌లో ఇరుకిరుకు సందుల మధ్య ఉంటున్న వాళ్ల ఇంటి ముందుకు రాలేక రోడ్డుపైనే కారును నిలబెట్టి ఓ మనిషితనం వాళ్ల వైపు నడుచుకు వస్తుంది. అలా నడిచి వస్తున్న ఆమె పేరు జమున అవుతుంది. కొన్నాళ్ల పాటు ఆ అభాగ్యులకు అన్నం పెట్టే తల్లి అవుతుంది. తల్లి అంటే ఒక్కరికే కాదుగా. మొత్తం సమాజానికేగా. ఇందుకే ఆమె ప్రజానటి అవుతుంది. రంగుల ప్రపంచంలో ఆలోచనలన్నీ రంగుల లోకంలోనే విహరించాలి. కలలు కూడా ఈస్ట్‌మన్ కలర్‌లోనే కనాలి. ఆ రంగుల లోకంలో చాలామంది అలాగే చేసారు. కొందరు మాత్రమే తమ బ్లాక్ అండ్ వైట్ సినిమాలని గుర్తుంచుకుని అలాంటి జీవితాలు ఇంకా ఉన్నాయని ఎరుక కలిగి ఉంటారు. అలాంటి వారి పేర్లు గుర్తుండిపోతాయి. ఇదిగో, ఇప్పుడు జమునలా...

జర్నలిస్టుగా జమున చేతి వంట తినడం నాకు నా వృత్తి ఇచ్చిన బహుమతి. పెయింటింగ్ ఆన్ గ్లాస్ (రివర్సల్ పెయింటింగ్) ఆర్టిస్టు అయిన జమున కుమార్తె స్రవంతిని వృత్తిలో భాగంగా ఇంటర్వ్యూ చేయడానికి వాళ్లింటికి వెళ్లాను. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ జమున ఇంట్లోనే గడిపాను. ఆ రోజు భోజనం చేస్తే తప్ప వెళ్లకూడదంటూ పట్టుపట్టారు జమున. ఇది నాకు దొరికిన అదృష్టం. మరో అపురూపం. పన్నెండేళ్లకొకసారి వచ్చే గోదావరి పుష్కరాల సమయంలో తనతోపాటు నటించి స్వర్గస్తులైన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులకు జమున తర్పణాలు వదిలేవారు. ఇంతే. జమున అంటే ఇంతే. ఇంతకంటే ఇంకేం లేదు.

సీనియర్ జర్నలిస్టు, 9912019929

ఇ-మెయిల్

అవార్డులకి ప్రాతిపదిక ఏమిటి?

పద్మశ్రీ, పద్మభూషణ్, భారతరత్న, నోబెల్ పురస్కారాన్ని సమాజానికి వారు చేసిన సేవల ఆధారంగా ఆయా రంగాల వారిని గౌరవించటం మన సాంప్రదాయం. ఈ నేపథ్యంలో లౌకికరాజ్యమైన భారతదేశంలో ప్రత్యేకంగా ఒక మతాన్ని ప్రోత్సహించే చినజియర్‌కి పద్మభూషణ్ ఇవ్వటమనేది పెద్ద ప్రశ్నార్థకమైంది. ఆయన సమాజానికి చేసింది ఏమిటి? ఒక కర్రకి గుడ్డ చుట్టుకొని రామానుజ మతస్థునిగా బోధనలు చేయడం తప్ప. ఈ మధ్యనే ఆయన ఏ కులపోళ్లు ఆ కులపుపనులు చెయ్యాలి, కులవ్యవస్థ ఇలాగే ఉండాలి అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసాడు. కోడిని తినేవాడికి కోడిఅలవాట్లు, మేకనుతినేవాడికి మేకఅలవాట్లు వస్తాయని వ్యాఖ్యానించడం సరైందికాదు. ఇంత సనాతనవాదికి పద్మభూషణ్ ఇవ్వటం అత్యంత హేయమైనచర్య. శాస్త్రీయదృక్పథం కలవారికి, సైన్సు ప్రచారకులకూ, హేతువాద, నాస్తిక, మానవవాద ప్రచారకులకు పద్మశ్రీలు, పద్మభూషణ్‌లు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఒక మతాన్ని ప్రోత్సహించి, ప్రచారంచేసే చినజియర్‌కి పద్మభూషణ్ ఇవ్వడమంటే అది ఖచ్చితంగా రాజ్యాంగధిక్కరణ కిందకేవస్తుంది. ఈపద్ధతి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మన దేశంలో దొంగబాబాలకు, దొంగస్వాములకీ, పీఠాధిపతులుకి కీలక బిరుదులు ఇచ్చినా ఆశ్చర్యపోనవసరంలేదు. ఆ మధ్య ప్రధాని మోదీ కేరళ వెళ్ళినపుడు, అక్కడి దొంగమాతగా పేరొందిన అమృతానందమయి ఆశ్రమానికివెళ్ళి ఆమెకు భారతరత్న ఇచ్చే అర్హతలున్నట్లుగా వ్యాఖ్యానించారు. ఆమె మీద ఎన్నో కేసులున్నాయి. అశాస్త్రీయ, ఛాందసవాదులను, మూఢాచార ప్రచారకులను ప్రభుత్వం తీవ్రంగా నియంత్రించవలసిన అవసరం ఉంది. ఈ పద్ధతికి ముగింపు పెట్టకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్న బురిడీబాబాలు, చేవూరు దొంగస్వామి, కల్కి భగవాన్, స్వరూపానంద, గణపతి సచ్చిదానంద, కర్నూలు బాల సాయిబాబా, పుట్టపర్తి సాయిబాబాలకు భారతరత్నలు, పద్మవిభూషణ్‌లు ఇస్తుందేమో ఈ ప్రభుత్వం!

-నార్నె వెంకటసుబ్బయ్య

ఎప్పుడూ షార్ట్‌కట్ తీసుకోవద్దు

మోసం దీర్ఘకాలం సాయం చేయదు

'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులతో మోదీ

న్యూఢిల్లీ : ఎప్పుడూ షార్ట్‌కట్ తీసుకోవద్దని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం విద్యార్థులకు తన సందేశంలో చెప్పారు. మోసం ఒక పరీక్ష లేదా రెండు పరీక్షలలో వారికి సహాయపడవచ్చు కానీ దీర్ఘకాలంలో కాదని హెచ్చరించారు. శుక్రవారం ఇక్కడి తాల్కతోరా స్టేడియంలో 'పరీక్ష పే చర్చ' ఆరవ ఎడిషన్, పరీక్షల ఒత్తిడి వంటి సమస్యలపై విద్యార్థులతో వార్షిక సంభాషణ సందర్భంగా విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిస్తూ, వారు తమ పనిపై దృష్టి సారించాలని అన్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలను విపరీతంగా ఉపయోగించవద్దని విద్యార్థులను హెచ్చరించిన ఆయన, మొబైల్ ఫోన్‌లలో కాకుండా వారి స్మార్ట్‌నెస్‌పై నమ్మకం ఉంచాలని కోరారు. 'సాంకేతికతతో పరధ్యానం చెందకండి. సామాజిక మాధ్య వేదికలలో పరస్పర చర్య కోసం మీరు మొబైల్ ఫోన్‌లను ఉపయోగించే సమయంలో ప్రత్యేక సమయాన్ని కేటాయించండి' అని ప్రధాని చెప్పారు. పరీక్షలలో అన్యాయమైన పద్ధతులను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ, ఒత్తిడిని నివారించడానికి తమ పరీక్షలు ఎంత బాగా జరిగాయని గొప్పగా చెప్పుకోవద్దని ఆయన విద్యార్థులకు సూచించారు. 'మోసం అనేది ఒకటి లేదా రెండు పరీక్షల్లో ఎవరికైనా సహాయపడవచ్చు. కానీ దీర్ఘకాలంలో జీవితంలో కాదు. షార్ట్‌కట్‌ని ఎప్పుడూ తీసుకోవద్దు. విద్యార్థుల కష్టపడి జీవితంలో ముందుకు సాగడానికి ఎల్లప్పుడూ సహాయపడుతుంది. విద్యార్థులు వారిపై ప్రయోగించిన ఒత్తిడిని విశ్లేషించుకోవాలి. వారు తమ బలాన్ని తక్కువగా అంచనా వేస్తున్నారు' అని ఆయన అన్నారు. అయితే కుటుంబ సభ్యులకు అంచనాలు ఉండటం సహజమే కానీ సామాజిక వర్గం లేదా హోదాపై స్పృహతో ముడిపడి ఉంటే అది తప్పు అని మోదీ అన్నారు. పరీక్షల ఫలితాలు జీవితానికి ముగింపు కావు' అని విద్యార్థులతో అన్నారు. గుంపు నుంచి ఫోర్లు, సిక్సర్ల అరుపులను పట్టించుకోకుండా బ్యాటర్ తనకు విసిరిన బంతిపై దృష్టి పెడుతున్నట్లుగా విద్యార్థులు తమ చదువుపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. 'మా పరీక్షలో మనం ఎంత బాగా చేశామో అని గొప్పలు చెప్పుకోవడం ఒత్తిడికి ఒక కారణం. తల్లిదండ్రులు పిల్లలు చెప్పేది నమ్మి చుట్టుపక్కల వారికి చెప్పడం మొదలుపెడతారు. పరీక్షలలో మీ పనితీరు గురించి తప్పుడు అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండండి' అని ప్రధాన మంత్రి అన్నారు. విద్యార్థులు తమ పరిధులను విస్తరించుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిన మోదీ, 10, 12వ తరగతి పరీక్షల తర్వాత తమ పిల్లలకు కొంత డబ్బు ఇచ్చి కొన్ని ప్రదేశాలకు వెళ్లాలని, వాటి గురించి రాయమని వారిని అడగాలని మోదీ తల్లిదండ్రులకు సూచించారు. 'విద్యార్థులు సమాజంలోని వివిధ వర్గాల ప్రజలను కలుసుకునేలా ప్రోత్సహించాలి. విద్యార్థులపై అనేక ఆంక్షలు విధించకూడదు. వారి పరిధులను విస్తరించడానికి వారిని అనుమతించాలి' అని అన్నారు. ప్రశ్నలు అడిగే విద్యార్థులను ఆహ్వానించాలని ఉపాధ్యాయులకు ప్రధాని సూచించారు. 'విద్యార్థి ప్రశ్నలు వేస్తే, అతను లేదా ఆమె జిజ్ఞాస కలిగి ఉంటాడు. ఇది మంచి సంకేతం' అని తెలిపారు. 'పరీక్ష పే చర్చ'లో పాల్గొనేందుకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో 38 లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం గత ఏడాది కంటే కనీసం 15 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. పాఠశాల, కళాశాల విద్యార్థులతో ప్రధాన మంత్రి సంభాషణ కార్యక్రమం మొదటి భాగం ఫిబ్రవరి 16, 2018న జరిగింది.

త్వరలో మధ్యప్రదేశ్‌కు దక్షిణాఫ్రికా చిరుతలు

భోపాల్: వచ్చే నెలలో దక్షిణాఫ్రికా నుంచి డజను చిరుతలను భారత్‌కు తీసుకొచ్చే అవకాశం ఉందని, వాటిని మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్(కేఎన్‌పి)లో ఉంచనున్నామని, గతేడాది నమీబియా నుంచి ఇలాగే చిరుతలను తీసుకొచ్చినట్టు ప్రాజెక్టు నిపుణుడొకరు తెలిపారు. దీనికి సబంధించి గత వారం న్యూదిలీ-ప్రిటోరియా (దక్షిణాఫ్రికా పరిపాలనా రాజధాని) మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. 'దక్షిణాఫ్రికా నుంచి వచ్చే చిరుతలు ఫిబ్రవరి మధ్యలో భారతదేశంలోకి వస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన తెలిపారు. ఒక్కొక్క చిరుతకు 3వేల డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై కేఎన్‌పీ డైరెక్టర్ ఉత్తమ్ వర్మ మాట్లాడుతూ '12 దక్షిణాఫ్రికా చిరుతల రాక కోసం ఎదురుచూస్తున్నాం. వాటి కోసం 10 ఎన్‌క్లోజర్‌లు ఏర్పాటు చేశాం' అని తెలిపారు. అయితే అవగాహన ఒప్పందంపై సంతకాలు ఆలస్యమయ్యాయి. దీంతో జులై 15 నుంచి ఈ చిరుతలను నిర్బంధించిన కారణంగా అవి స్వల్ప అనారోగ్యానికి గురయ్యాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా నిర్బంధిస్తే అవి తమ ఫిట్‌నెస్‌ను కోల్పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సిక్కింలో కొత్త రాజకీయ పార్టీ

గ్యాంగ్‌టక్: సిక్కింలో ఓ కొత్త రాజకీయ పార్టీ ఊపిరిపోసుకుంది. సిటిజన్ యాక్షన్ పార్టీ (సీఏపీ) పేరిట ఉత్తర సిక్కిం జిల్లాల్లోని మెల్లిలో ఏర్పాటు చేశారు. దీనికి కో-ఆర్డినేటర్‌గా గణేశ్ రాయ్ వ్యవహరించనున్నారు. పార్టీ తీరుతెన్నులకు సంబంధించిన పత్రాలను ఆయన గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికార పార్టీ సిక్కిం క్రాంతికారి పార్టీపై ఆయన నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో అవినీతి పెచ్చుమీరిందని, కేవలం వారి పార్టీ నాయకులకు లబ్ధి కలిగేలా రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సిక్కింలో స్థానికుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని, భూములను బయట వ్యక్తులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందని, రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న లింబూ-తమాంగ్‌లకు స్థానాల కేటాయింపుతో సహా ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేం వాగ్దానాన్ని నిలబెట్టుకుంటాం. ప్రస్తుత ప్రభుత్వంలాగా క్షమాపణలు కోరం. అధికార పార్టీకి రోజులు దగ్గరపడ్డాయి, 2024లో జరగబోయే ఎన్నికల్లో సిటిజన్ యాక్షన్ పార్టీ అధికారంలో రావడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. పవన్‌కుమార్ చామింగ్ నేతృత్వంలోని సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్‌కు, ఎస్‌కేఎంకు ఎలాంటి తేడా లేదన్నారు.

చైనా మాంజా కారణంగా యువకుడికి తీవ్రగాయాలు

పగ్వారా(పంజాబ్): చైనా మంజా కారణంగా 17ఏళ్ల యువకుడిని తల, గొంతు భాగంలో తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు శుక్రవారం తెలిపారు. ఈ ఘటన గురువారం జరిగింది. బాధితుడు సోహిల్ బైక్‌పై వస్తుండగా, చైనా మాంజా చుట్టుకొని తీవ్ర గాయాలయ్యాయి. వైద్యులు 30దాకా కుట్లు వేశారు. పంజాబ్‌లోని అనే ప్రాంతాల్లో చైనా మాంజా కారణంగా ఇలా ఘటనలు అనేకం వెలుగు చూశాయి. మరోవైపు, ఇందర్‌నగర్‌లోని ఓ దుకాణదారుడు ఇలాంటి మాంజానే విక్రయిస్తున్న కారణంగా అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. అతడి నుంచి మూడు బండిళ్ల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నామని, గాలిపటాలు ఎగువేస్తున్న గుల్షన్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్టు వివరించారు. అలాగే ఇతర ప్రాంతాల్లో కూడా చైనా మాంజాలను గాలించేందుకు పోలీసులు విస్తృత తనిఖీలు మొదలుపెట్టారు. ఇలా ఉంటే... చైనా మాంజాను నైలాన్/సింథటిక్ దారాన్ని తీసుకుని దానికి గాజుపెంకులు, లోహాల వ్యర్థాన్ని కలిపి పొడిగా చేసి పూస్తారు. దీంతో ఆ దారం బాగా పదునెక్కుతుంది. గాలిపటాల పోటీలు జరిగే సమయంలో చాలామంది దీంతో ప్రమాదమని తెలిసినా, ఆనందం కోసం కొనుగోలు చేస్తుంటారు.

ఇన్‌ఫార్మర్లను ప్రభుత్వం ప్రోత్సహించాలి: హైకోర్టు



ముంబై: ఇన్‌ఫార్మర్లు అపారమైన రిస్కులు తీసుకుంటారని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సమాచారం ఇవ్వకుండా వారిని నిరుత్సాహపరచకూడదని బాంబే హైకోర్టు ఇటీవల పేర్కొంది. 1991లో దాదాపు రూ.90లక్షల విలువైన వజ్రాలు అక్రమంగా తరలించినట్లు కస్టమ్స్ అధికారులకు తెలియజేసిన వ్యక్తి భార్యకు రివార్డు చెల్లించాలని కేంద్రాన్ని బాంబే హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తులు నితిన్ జామ్దార్, అభయ్ అహూజాలతో కూడిన డివిజన్ బెంచ్ జనవరి5 నాటి తన ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఇన్‌ఫార్మర్‌లకు రివార్డ్ అందించడం వెనుక ఉన్న లక్ష్యం ఖజానాను రక్షించడానికి చర్యలు తీసుకోవడంలో డిపార్ట్‌మెంట్‌కు సహాయం చేయడమే అని పేర్కొంది. ప్రభుత్వ విధానం ప్రకారం ఇన్‌ఫార్మర్లకు రివార్డు ఇవ్వాలని కోరుతూ చంద్రకాంత్ దాహ్రే భార్య జయశ్రీ దాహ్రే దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. 1991లో చంద్రకాంత్ పంచుకున్న సమాచారం ఆధారంగా కస్టమ్స్ శాఖ స్మగ్లింగ్ చేసిన వజ్రాలను స్వాధీనం చేసుకుంది. ఇన్‌ఫార్మర్‌కు కొన్ని సంవత్సరాల్లో అడ్వాన్స్‌గా రూ.3 లక్షలు చెల్లించారు, అయితే అనేక రిమైండర్‌లు ఉన్నప్పటికీ తుది మొత్తం ఎప్పుడూ పంపిణీ కాలేదు. చంద్రకాంత్ నిజమైన ఇన్‌ఫార్మర్ అవునా? కాదా అని మొదట ధృవీకరించాల్సిన అవసరం ఉందని డిపార్ట్‌మెంట్ కోర్టుకు తెలిపింది. అయితే బెంచ్ అతనికి గతంలో రెండు ముందస్తు చెల్లింపులను విడుదల చేసిందని పేర్కొన్న వాదనను తిరస్కరించింది. రివార్డ్‌ను డిమాండ్ చేసే చట్టపరమైన హక్కు లేనప్పటికీ, పాలసీ ప్రకారం, తిరస్కరణ ఏకపక్షంగా ఉండకూడదని హైకోర్టు పేర్కొంది.

ఏనుగు దాడి... రేషన్ దుకాణం ధ్వంసం

ఇడుక్కి(కేరళ): ధాన్యం వెతుకులాటలో భాగంగా, ఏనుగులు తరచుగా మానవ ఆవాసాలలోకి వస్తున్నాయి. ఈక్రమంలో ఓ అడవి ఏనుగు శుక్రవారం తెల్లవారుజామున ఇడుక్కిలో ఉన్న ఒక ఎస్టేట్‌లోని రేషన్ దుకాణాన్ని ధ్వంసం చేసిందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. 'అరికొంబన్' అని పిలువబడే ఏనుగు బియ్యంపై ఉన్న ప్రేమ కారణంగా దుకాణంలోకి చొరబడిందని పేర్కొన్నారు. అయితే, ఈ రేషన్ దుకాణం ఎక్కువగా ఏనుగులు సంచరిస్తున్న మార్గంలో ఉందని, ఈ కారణంగానే దుకాణంపై ఏనుగుల దాడి జరిగిందా అనేది తేల్చాల్సి ఉందని వన్యప్రాణి అధికారులు తెలిపారు. పన్నియార్ ఎస్టేట్‌లోని రేషన్ దుకాణంపై గడచిన 10 రోజుల్లో నాలుగుసార్లు ఏనుగు దాడి చేయగా, దుకాణం స్వల్పంగా ధ్వంసమైందని, శుక్రవారం ఉదయం వచ్చిన ఏనుగు ధాటికి పూర్తిగా ధ్వంసమైందని ఆంటోని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇది రేషన్ షాపులో నిల్వ చేసిన బియ్యం, ఇతర వస్తువులను తినేది. కానీ, ఈ ఉదయం, దాడిని ఊహించి మేము ఇప్పటికే అన్ని సరుకులను మరొక గదికి మార్చాం. అందుకే ఏనుగు తినడానికి అక్కడ ఏమీ లేవు' అని ఆంటోని పేర్కొన్నాడు. ఏనుగుకు బియ్యంతో పాటు, పంచదార, గోధుమలు కూడా ఇష్టమని, తరచూ అవి కూడా తింటూ ఉంటుందని ఆయన వివరించారు.

నాందేడ్‌లో పరువుహత్య

వైద్య విద్యార్థిని చంపిన కుటుంబం

ముంబై: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో మరో పరువు హత్య జరిగింది. తాము కుదుర్చిన సంబంధం కాదని...మరొకరిని ప్రేమించినందుకుగాను 22 ఏళ్ల వైద్య విద్యార్థిని తండ్రి, సోదరుడు, మరో ముగ్గురు బంధువులు కిరాతకంగా చంపేశారని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. లింబగావ్ పోలీసు స్టేషన్ పరిధిలో గల పింప్రీ మహిపాల్ గ్రామంలో జవవరి 22న ఈ దారుణం జరిగింది. నిందితులు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ముందుగా విద్యార్థి మెడకు తాడుతో ఉరేసి చంపారు. తర్వాత మృతదేహాన్ని దహనం చేశారు. అక్కడ ఎలాంటి ఆధారాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మృతురాలు హోమియోపతి మెడిసిన్, సర్జరీ(బీహెచ్ఎంఎస్) మూడో సంవత్సరం చదువుతోంది. అయినా ఆమె వివాహాన్ని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. అయితే, ఆమె తన ప్రేమ గురించి కుటుంబ సభ్యులు చూసిన వరుడికి చెప్పింది. తమ గ్రామానికి చెందిన యువకుడితో తానే ప్రేమలో ఉన్నట్లు వెల్లడించింది. దీంతో పెళ్లి ఆగిపోయింది. తీవ్ర ఆగ్రహానికి గురైన బాధితురాలి కుటుంబం ఆగ్రహంతో ఊగిపోయింది. తండ్రి, సోదరుడు, బాబాయి, ఆయన ఇద్దరు కొడుకులు ఆ అమ్మాయిని జనవరి 22 రాత్రి పొలం తీసుకెళ్లారు. అక్కడ ఆమెను చంపేశారు. సాక్ష్యాలు ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని పోలీసులు తెలిపారు.

11న కేరళలో వృత్తి విద్యార్థుల సదస్సు

కోచి: కేరళ ప్రభుత్వం ఏటా నిర్వహించే వృత్తి విద్యార్థుల సదస్సు-2023 మూడో ఎడిషన్ ఫిబ్రవరి 11న ఇక్కడికి సమీపంలోని అంగమాలిలో జరగనుంది. ఉన్నత విద్యాశాఖ నిర్వహించే ఈ భారీ సదస్సును కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తారు. దేశీయంగా మొట్టమొదటి స్వదేశీ కోవిడ్-19 వాక్సిన్‌ను అభివృద్ధి చేసిన భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా, సభకు ముఖ్య అతిదిగా హాజరై ప్రసంగించనున్నారు. కేరళను నాలెడ్జ్ బేస్డ్ ఎకానమీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, వృత్తి విద్యార్థుల సదస్సు అందుకు దోహదపడుతుందని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్.బిందు తెలిపారు. జ్ఞాన మార్పిడికి దారితీసే, విద్యార్థుల సహకారాన్ని స్వాగతించే ఏవైనా కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉందని ఆమె పేర్కొన్నారు. డజనుకు పైగా పరిశ్రమల ప్రముఖులు, విద్యావేత్తలు విద్యార్థులతో సంభాషిస్తారని చెప్పారు. 300 కాలేజీల నుంచి మెడిసిన్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ స్ట్రీమ్‌లకు చెందిన 2వేల మంది వృత్తి విద్యార్థులు సదస్సుకు హాజరవుతారు.

రెసిడెన్షియల్ స్కూళ్లలో పీయూసీ కోర్సులు: బొమ్మై

బెంగళూరు: పదేళ్లు పూర్తి చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రీ-యూనివర్శిటీ కోర్సులను (పీయూసీ) అందిస్తాయని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై శుక్రవారం తెలిపారు. ఈ రెసిడెన్షియల్ పాఠశాలలు విద్యార్థుల మధ్య పోటీ పరీక్షలను కూడా నిర్వహించవలసి ఉంటుందని, తద్వారా వారు చదువు పూర్తి చేసి ఉద్యోగాల కోసం వెతుకులాడేటప్పుడు అలాంటి సవాళ్లను సులభంగా ఎదుర్కొంటారని బొమ్మై చెప్పారు. కర్ణాటక రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ (కెఆర్ఇఐఎస్) 'సైన్స్ ఎక్స్‌పో-2023'ని ప్రారంభించిన అనంతరం బొమ్మై మాట్లాడుతూ... కేవలం కాంట్రాక్టర్లను సంతృప్తి పరచడానికి పాఠశాల భవనాల నిర్మాణానికి మాత్రమే డబ్బు ఖర్చు చేసే ధోరణిని విడనాడాలని సాంఘిక సంక్షేమ శాఖను ముఖ్యమంత్రి కోరారు. బదులుగా, విద్య నాణ్యతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని సూచించారు. 10 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఉండి 10 వ తరగతి విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో వచ్చే సంవత్సరం నుంచి ప్రీ-యూనివర్సిటీ కళాశాలలను ప్రారంభించాలని బొమ్మై అన్నారు. విద్యార్థులు తమ పీయూసీ విద్యను అదే రెసిడెన్షియల్ పాఠశాలలో కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ పాఠశాలల్లో పిల్లల మధ్య పోటీ పరీక్షలను నిర్వహించాలి... పిల్లల్లో లోటుపాట్లను తెలుసుకుని వాటిని సరిదిద్దేందుకు, వారి సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా వారికి స్థాయిని కల్పించాలని చెప్పారు.

దేశం కోసమే...రాహుల్ కోసం కాదు

భారత్ జోడో యాత్రపై ఒమర్ అబ్దుల్లా

బనిహాల్: కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారత్ జోడో యాత్ర రాహుల్‌గాంధీ ప్రతిష్ఠను పెంచడానికి కాదని, దేశంలో నెలకొన్ని వాతావరణం మార్చడానికేనని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా శుక్రవారం స్పష్టంచేశారు. కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్రలో ఒమర్ అబ్దుల్లా పాల్గొన్నారు. జమ్ముకశ్మీరుకు ప్రత్యేకహోదా పునరుద్ధరణపై కాంగ్రెస్ వైఖరి గురించి ప్రశ్నించగా ఆయన సమాధానం దాటవేశారు. ఆ అంశాన్ని ప్రస్తావించాలని తాను కోరుకోవడం లేదని ఒమర్ తెలిపారు. 'వ్యక్తుల ప్రతిష్ఠ కోసం మేము ఈ యాత్రలో పాల్గొనడం లేదు. కేవలం దేశ ప్రతిష్ఠను పెంపొందించడానికి చేతులు కలుపుతున్నాం' అని ఆయన వివరించారు. వాస్తవంగా వ్యక్తిగత హోదా, ప్రతిష్ఠ కోసం రాహుల్‌గాంధీ యాత్ర ప్రారంభించలేదని, దేశంలో మత ఉద్రిక్తతలు సృష్టించడం, మైనారిటీలు లక్ష్యంగా దాడులు జరగడంపై ఆందోళనతోనూ చేపట్టారని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. జోడో యాత్రలో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చిన ఒమర్ మీడియాతో మాట్లాడారు. అరబ్ దేశాలను మిత్రులుగా చేసుకోవడానికి మోదీ సర్కారు తంటాలు పడుతుందని, కానీ తన ప్రభుత్వంలో పెద్దసంఖ్యలో ఉన్న మైనారిటీలకు ప్రాతినిధ్యం కల్పించలేదని ఒమర్ విమర్శించారు. స్వాతంత్ర్యం లభించిన తర్వాత పాలక పార్టీ నుంచి ముస్లిం ప్రతినిధి ఒక్కడు కూడా పార్లమెంటులో లేకపోవడం ఇదే మొదటిసారని గుర్తుచేశారు. బీజేపీ వైఖరి ఏమిటో ఇదే సూచిస్తోందని తెలిపారు. 2016 సర్జికల్ దాడుల గురించి కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆ ఆపరేషన్ గురించి తమ పార్టీ ఏనాడు ప్రశ్నించలేదన్నారు. అది కాంగ్రెస్ అంతర్గత వ్యవహారమని చెప్పారు. జమ్ముకశ్మీరుకు ప్రత్యేకహోదా రద్దు గురించి కాంగ్రెస్ వైఖరి ఏమిటని అడుగగా ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం తాము కోర్టులో పోరాడుతున్నామని, కేసు ముందుకు రాకుండా కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోందని ఒమర్ విమర్శించారు.

సెంగార్ బయటికొస్తే మమ్మల్ని చంపేస్తాడు

- కోర్టుకు బాధితురాలి వినతి
- తాత్కాలిక బెయిల్ వ్యవధిని తగ్గించిన దిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న బీజేపీ బహిష్కృత నాయకుడు కుల్దీప్ సింగ్ సెంగార్‌కు రెండు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను దిల్లీ హైకోర్టు సవరించింది. శుక్రవారం ఉదయం తీహార్ జైలు నుంచి సెంగార్ విడుదలయ్యారని తెలియజేసిన హైకోర్టు... తనకు, తన కుటుంబానికి ముప్పు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు చేసిన దరఖాస్తుపై సవరణ ఉత్తర్వులు జారీ చేసింది. తన కుమార్తె వివాహ కార్యక్రమాల కారణంగా జనవరి 16న సెంగార్‌కు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన న్యాయమూర్తులు ముక్తా గుప్తా, పూనమ్ ఎ బాంబాలతో కూడిన ధర్మాసనం... తాజాగా జనవరి 30న కుమార్తె వివాహానికి సంబంధిన వేడుక ముగియగానే సెంగార్ ఫిబ్రవరి 1న జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. కుమార్తె వివాహం ఫిబ్రవరి 8న అయినందున సెంగార్ మళ్లీ ఫిబ్రవరి 6న జైలు నుంచి విడుదలై ఫిబ్రవరి 10న లొంగిపోతారని పేర్కొంది. కోర్టుకు హాజరైన బాధితురాలు... 'కుల్దీప్ సెంగార్‌కు బెయిల్ మంజూరైతే నాకు, సాక్షులకు ప్రమాదం ఉంటుంది. అక్కడి ప్రభుత్వ అధికారులందరూ ఆయన నియమించినవారే. అతన్ని విడుదల చేయవద్దని నేను అభ్యర్థిస్తున్నాను, లేకుంటే అతను నన్ను చంపేయగలడు' అని పేర్కొంది. బాలిక తరపు న్యాయవాది మెహమూద్ ప్రాచా మాట్లాడుతూ... సెంగార్ కస్టడీలో ఉన్నప్పుడు కూడా ముప్పు ఉందని తెలిపారు. సాధారణంగా జైలు నుంచి విడుదల అవడం సాయంత్రం జరుగుతుంటుంది. సెంగార్‌ను ప్రత్యేకంగా ఉదయాన్నే విడుదల చేయడం ఆయన పలుకుబడికి నిదర్శనమని చెప్పారు. సెంగార్ తరపున సీనియర్ న్యాయవాది ప్రమోద్ దూబే, బాధితురాలి అభ్యర్థనను వ్యతిరేకించారు. సెంగార్‌కు ఉపశమనం కల్పించేటప్పుడు కోర్టు అతనికి తగిన షరతులు విధించింది. ఇప్పుడు వ్యవధిని తగ్గించడానికి బదులుగా అతడ్ని ఇంట్లోనే ఉండమని కోర్టు కోరవచ్చునన్నారు. బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సెంగార్ ప్రస్తుతం జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. 2017లో ఉన్నావ్ లో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు సెంగార్‌పై అభియోగాలు నమోదయ్యాయి. దిల్లీ కోర్టు 2019లో ఆయనను దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. పిటిషనర్ తండ్రిని హత్య చేసిన కేసులో ఇద్దరు పోలీసు అధికారులు, మరో నలుగురిని కూడా దోషులుగా తేల్చిన కోర్టు వారికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది.

భారత ఔషధ పరిశ్రమ వ్యూహాత్మక ఆస్తి

న్యూఢిల్లీ: గడచిన కొన్నేళ్లుగా కోవిడ్-19 కారణంగా ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడిన తరుణంలో భారతదేశ బయోఫార్మా, డయాగ్నస్టిక్ పరిశ్రమ దేశీయంగానే కాక ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్య అవసరాలను తీర్చడానికి వ్యూహాత్మక ఆస్తులుగా నిరూపించబడిందని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా శుక్రవారం తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్ (ఎన్ఐబీ) ఇక్కడ ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. సాంప్రదాయ రసాయన మందులతో పాటు జీవ ఔషధాలు కూడా చికిత్స ఎంపికగా ఉద్భవించాయని మంత్రి అన్నారు. నాణ్యమైన జీవ ఉత్పత్తులు మాత్రమే ఆరోగ్య వ్యవస్థకు చేరేలా చూడటంలో ఎన్ఐబీ కీలక పాత్ర పోషిస్తోందని, తద్వారా అందరికీ నాణ్యమైన ఆరోగ్యం, ఆరోగ్యాన్ని అందించాలనే ప్రధాన మంత్రి మిషన్‌ను బలోపేతం చేస్తుందన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం: కేజ్రీవాల్

అమృత్‌సర్: ఆమ్‌ఆద్మీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ శుక్రవారం రాష్ట్రంలో మరో 400 'ఆమ్ ఆద్మీ' క్లినిక్‌లను ప్రారంభించారు. దీంతో ఈ ఆరోగ్య కేంద్రాల మొత్తం సంఖ్య 500కి చేరింది. పంజాబ్ ప్రభుత్వం కేవలం 10 నెలల్లోనే 500 క్లినిక్‌లను ప్రారంభించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా కేజ్రీవాల్ అన్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికలకు ముందు పంజాబ్ ప్రజలకు పార్టీ చేసిన వాగ్దానాలను ప్రస్తావిస్తూ... భగవంత్ మాన్ కేజ్రీవాల్ ఇచ్చిన మరో హామీని నెరవేర్చారని చెప్పడానికి నేను సంతోషపడుతున్నానని చెప్పారు. పంజాబ్‌లో ఐదు వందల ఆమ్‌ఆద్మీ క్లినిక్‌లను ఏర్పాటు చేశామని, రానున్న కాలంలో మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని కేజ్రీవాల్ చెప్పారు. హామీలన్నీ నెరవేరుతాయని , పంజాబ్ ప్రజలు ఓపిక పట్టాలని అన్నారు. ప్రతినెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామన్న ఎన్నికల వాగ్దానాన్ని ఆప్ ఇప్పటికే నెరవేర్చిందని ఆయన చెప్పారు. మన్ ప్రభుత్వం అవినీతికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని, అవినీతి కార్యకలాపాలకు పాల్పడినట్లు తేలిన వారిని విడిచిపెట్టదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ ఆరోగ్య మంత్రి బల్బీర్ సింగ్, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా పాల్గొన్నారు.

బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనపై ఉక్కుపాదం

న్యూఢిల్లీ: గోధ్రా అల్లర్లకు సంబంధించి బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ డాక్యుమెంటరీని విద్యార్థి సంఘాలు విద్యాలయాల్లో ప్రదర్శించడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు. అరెస్టులకు పాల్పడుతున్నారు. తాజాగా దిల్లీలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు డాక్యుమెంటరీ ప్రదర్శనకు సిద్ధపడగా దిల్లీలో పోలీసులు ప్రవేశించి...దానిని అడ్డుకున్నారు. పెద్దసంఖ్యలో యూనివర్సిటీ క్యాంపస్‌లోకి ప్రవేశించిన పోలీసులు డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకున్నారని విద్యార్థులు ఆరోపించారు. అయినప్పటికీ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా వీక్షించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సరఫరాను నిలిపివేయడం ద్వారా వాటిని కూడా అడ్డుకున్నట్లు తెలిపారు. అయితే, శాంతియుత వాతావరణం కోసం జిల్లాలోని అన్ని కాలేజీలు, విశ్వవిద్యాలయాలను తాము సందర్శిస్తున్నామని పోలీసు అధికారులు చెబుతున్నారు. అంబేద్కర్ యూనివర్సిటీ ప్రభుత్వ నేతృత్వంలో నడుస్తున్నదని, అయినా విద్యుత్ సరఫరా నిలిపివేయడం ద్వారా ప్రదర్శనను అడ్డుకుంటున్నారని విద్యార్థులు విమర్శించారు. అయితే క్యూఆర్ కోడ్ ద్వారా డాక్యుమెంట్ లింక్‌ను విద్యార్థులకు తమ వ్యక్తిగత ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లకు పంపిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు డాక్యుమెంటరీ ప్రదర్శిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ ప్రకటించింది. మరోవైపు, జేఎన్‌యూ, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీల్లో డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకోవడానికి నిరసనగా ఆందోళనకు దిగుతున్నట్లు ఏఐఎస్ఏ తెలిపింది. అంబేద్కర్ యూనివర్సిటీ క్యాంపస్‌లోకి పోలీసులను ఎలా అనుమతిస్తారని, ఏబీవీపీ హింసకు వ్యతిరేకంగా అంబేద్కర్ యూనివర్సిటీ విద్యార్థులు సంఘీభావం తెలపాలని కోరుకుంటున్నారని ఏఐఎస్ఏ తెలిపింది. జేఎన్‌యూ, జమియాలలో పోలీసు అణచివేతను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టంచేసింది.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు: ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్లు ఈనెల 30, 31న తలపెట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఓబులేసు ఓ ప్రకటన విడుదల చేస్తూ...బ్యాంకు ఉద్యోగ సంఘాల కోరికలు పూర్తిగా న్యాయసమ్మతమైనవని తెలిపారు. వేతనాల పెరుగుదల, నియామకం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ వంటి డిమాండ్లు గొంతెమ్మ కోరికలేమీ కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల వల్ల 9.50 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ రంగ ఉద్యోగులు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అదానీ, అంబానీ ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారని, మూడు శాతం బిలియనీర్ల ఆదాయం దేశ జనాభాలో 70శాతం ప్రజల ఆదాయంతో సమానమైందని తెలిపారు. ఈ విపత్కర వైరుధ్యాన్ని ఉద్దేశపూర్వకంగా మోదీ ప్రభుత్వం కల్పించిందేనని, ఈ పరిస్థితిలో ఆక్స్‌ఫామ్ నివేదికను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల జీతభత్యాలు పెంచటం, ధనికులపై పన్నుశాతం పెంచాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తున్నట్లు పునరుద్ఘాటించారు. బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో ఏఐటీయూసీ శ్రేణులు ప్రత్యక్షంగా పాల్గొంటారని, కేంద్ర ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యాలు వెంటనే స్పందించి ఉద్యోగుల కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కూలి రేట్ల జీవో అమలు కోసం

హమాలీల ఉద్యమబాట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సివిల్ సప్లయి కార్పొరేషన్ హమాలీలు కూలి రేట్లు పెంపుదల జీవో అమలు కోసం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. మండల స్థాయి స్టాక్ పాయింట్‌లో లోడింగ్ అన్ లోడింగ్ చేస్తున్న హమాలీ కార్మికులకు 2022 జనవరి ఒకటో తేదీ నుంచి కొత్త కూలి రేట్లు ఇవ్వవలసి ఉంది. ఇప్పటికి 13 నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సెప్టెంబర్ 13న కార్మిక సంఘాలతో చర్చలు జరిపి మూడు రూపాయలు పెంచుతామని హామీ చేశారు. తదుపరి నవం బరు 8న అధికారులు, కార్మిక సంఘాల నాయకులు ఒప్పందంపై సంతకాలు చేశారు. కానీ ఇంతవరకు కూలి రేట్ల పెంపుదల జీవో విడుదల చేయలేదు. పైగా గతంలో ఎన్నడూ లేని కొత్త నిబంధనలు విధిస్తూ లేబర్ ఇండెక్స్‌కి పంపించారు. గత 13 నెలలుగా పెంచిన జీతాల అమలు కోసం యూనియన్ నాయకులు ఎన్నిసార్లు అధికారులు చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోయింది. దీంతో విధి లేని పరిస్థితుల్లో హమాలీలు ఆందోళన బాట పట్టారు. ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజులపాటు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు విధులు బహిష్కరించి నిరసన తెలియజేయాలని రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు అందుకున్న కార్మికులు రాష్ట్రవ్యాపితంగా అన్ని సివిల్ సప్లయిస్ గోడౌన్ల ఎదుట వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కొన్ని చోట్ల అర్ధనగ్న నిరసనలు, మరికొన్ని చోట్ల ప్లేట్లు పట్టుకుని బిచ్చగాళ్ల తరహాలో నిరసనలు తెలియజేశారు. గొల్లపూడి ఏఐటీయూసీ కార్యాలయం నుంచి ఈ నిరసన కార్యక్రమాలను పర్యవేక్షించిన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య రాష్ట్రవ్యాప్తంగా సమ్మెను విజయవంతం చేసినందుకు హమాలీలను అభినందించారు. ఈ రెండు రోజులు టోకెన్ సమ్మేనని, ఈనెల 1వ తేదీ లోపల జీవో ఇవ్వకపోతే రెండవ తేదీ నుంచి నిరవధిక పని బంద్ సాగిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వానికి ప్రజల ద్వారా మంచి పేరు తేవడానికి సివిల్ సప్లయి కార్మికులు ఎంతో తోడ్పడుతుంటారని, అలాంటి వారి కడుపు కొట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నారు. శ్రీకాకుళం, కాకినాడలో బఫర్ గోడౌన్ల నుంచి డైరెక్ట్ మూమెంట్ పెట్టి కార్మికులకు పని లేకుండా కడుపు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు చోట్ల పైలెట్ ప్రాజెక్టులుగా మొదలుపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం రేపు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలనే దురుద్దేశంతో ఉందని ఆయన మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని, కార్పొరేషన్ మొదలుపెట్టినప్పటి దానిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న హమాలీ కార్మికులు కడుపు కొట్టడం ధర్మమేనా? అని ప్రశ్నించారు. స్టేజి 2 ద్వారానే ఎగుమతి దిగుమతి జరగాలని, పెంచిన కూలి రేట్లు తక్షణం జీవో విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల రెండో తేదీ నుంచి పై రెండు డిమాండ్లపై పెద్ద ఎత్తున పని బంద్ ఆందోళన సాగిస్తామని తెలిపారు. ఈ ఆందోళనా కార్యక్రమాలకు ఆయా జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ (ముఠా) వర్కర్స్ యూనియన్ నేతలు కామేశ్వరరావు, మన్మధరావు, చిక్కాల గోవిందు వీరబాబు, తాతయ్య, కొఠారి రమణ, రాంబాబు, చినాంజనేయులు, రావుల అంజిబాబు, పైడయ్య, పెంచలయ్య మాధవ, మురళి, అయ్యప్ప, సూరి, అతావుల, రమణ, మురారి తదితరులు నాయకత్వం వహించారు.

విభజన హామీలపై నిర్లక్ష్యం

మోదీ సర్కారు తీరుపై ఈశ్వరయ్య ఆగ్రహం

తిరుపతికి విద్యార్థి, యువజన బస్సు యాత్ర

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు చేయడంలో మోదీ సర్కారు పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. ఏపీ ప్రయోజనాలపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నట్లు మండిపడ్డారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం నిర్వహిస్తున్న విద్యార్థి, యువజనుల సమరయాత్ర శుక్రవారం తిరుపతి చేరుకుంది. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ శ్రీనివాస్ ఆడిటోరియంలో విద్యార్థి, యువజన నాయకులు బండి చలపతి,

జయచంద్ర అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈశ్వరయ్య మాట్లాడుతూ మోదీ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నట్లు ఆరోపించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా ఐదు కోట్ల మంది ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. అక్కడ మోదీ, అమిత్‌షా, ఇక్కడ సీఎం జగన్ ఈ అంశాలనే మర్చిపోయారని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం విద్యార్థి, యువత ప్రాణాలు పణంగా పెట్టి సమరయాత్ర కొనసాగిస్తున్నారని ఈశ్వరయ్య చెప్పారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మించకపోవడంతో రాయలసీమ విద్యార్థి, యువత ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని చెప్పారు. సీఎం జగన్ మెతక వైఖరితో రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రాన్ని అడుగడుగున్నా మోసగించిన మోదీ, జగన్ ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ మోదీ, జగన్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల రక్షణ కోసం బస్సుయాత్ర కొనసాగిస్తున్నారని చెప్పారు. యాత్రకు సంపూర్ణ సహకారం అందిస్తున్న అందరికీ అభినందనలు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర ,లెనిన్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సునీల్, ఎస్కేయూ ప్రొఫెసర్ సదాశివరెడ్డి, అల్లూరి సీతారామరాజు మేనల్లుడు సత్యనారాయణ రాజు, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం నాయకులు బుల్ రాజు, రవి కిరణ్ ప్రసంగించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు లంక గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్, బండి చలపతి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రామకృష్ణ, కత్తి రవి, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్, ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ కార్యదర్శి చిన్న, సుందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా కార్యదర్శి జింక నాగరాజు, డప్పుసూరి ఉద్యమ గీతాలు ఆలపించారు.

భారత్‌లో అప్రకటిత ఎమర్జెన్సీ

పీఎంఓలోకి న్యాయవ్యవస్థను చేర్చే కుట్ర- జైరాం రమేశ్

ఖానాబల్ (జమ్ముకశ్మీర్): దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి ఉన్నదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో న్యాయవ్యవస్థను చేర్చే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశానికి ఎన్నో 'ముప్పు'లు ఉన్నాయన్నారు. పెరుగుతున్న ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు, ఆర్ఎస్ ఎస్-బీజేపీ సామాజిక విభజనను-ఎన్నికల్లో లబ్ధి పొందే యత్నాలను, రాజకీయ నిరుంకుశత్వానికి చెక్ పెట్టేందుకే భారత్ జోడో యాత్రను కాంగ్రెస్ చేపట్టిందని తెలిపారు. యాత్రలో భాగంగా శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జైరాం రమేశ్ మాట్లాడుతూ 'దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ ఉంది. ఒక వ్యక్తి పరిపాలన సాగుతోంది. పార్లమెంటు నిర్లక్ష్యానికి గురవుతోంది. చట్టసభల్లో చర్చలు జరగడం లేదు. సరిహద్దులు ప్రమాదంలో ఉండటం (భారత్, చైనా మధ్య సరిహద్దు ప్రతిష్ఠంభనను ఉద్దేశించి), రెండున్నరేళ్లుగా చర్చలు జరగకపోవడమే ఇందుకు ఉదాహరణ' అని అన్నారు. రాజ్యాంగం నిర్లక్షించబడుతోందని, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యమవుతున్నాయని, న్యాయవ్యవస్థ వినాశానికి, దానిని పీఎంఓలో భాగం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. 'దేశ విభజన క్రమంగా జరుగుతోంది... ఎన్నో ప్రమా దాలు పొంచివున్నాయి. తక్షణమే చర్యలు చేపట్టకుంటే ముప్పు పెరుగుతుంది. అందుకోసమే ఆర్థిక అసమానతలు, సామాజిక విభజన, రాజకీయ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తుతున్నాం. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం.. ఎన్నికల వ్యూహంతో భారత్ జోడో



యాత్రకు సంబంధం లేదు' అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందనగా జైరాం రమేశ్ తెలిపారు. దేశంలో రెండు విధానాలు ఉన్నాయి. అందులో ఒకటి 'ఒక వ్యక్తి-ఒక వ్యవస్థ'. ఇది ఆర్ఎస్ఎస్-బీజేపీ కోరుకునేది. రెండవది సామ రస్య పథం. దీనిని కాంగ్రెస్ కాంక్షిస్తోంది. ఇదే మహాత్మాగాంధీ, రాహుల్‌గాంధీ మార్గం' అని మరొక ప్రశ్నకు జైరాం రమేశ్ సమాధానమిచ్చారు. కాగా భారత్ జోడో యాత్ర ఈనెల 30వ తేదీన కశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో భారీ ర్యాలీతో ముగియనున్న విషయం విదితమే.

పార్లమెంటులో చైనాపై చర్చకు డిమాండ్

చైనాకు మోకరిల్లే మోదీ ప్రభుత్వ నిజ స్వరూపాన్ని బహిర్గతం చేసేలా డీజీపీ-ఐజీపీ వార్షిక సదస్సు పరిశోధన పత్రాలు ఉన్నట్లు కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. చైనాపై పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని డిమాండ్ చేసింది. తనకు దేశం మీద ప్రేమో లేక చైనా అంటే భయమో ప్రధాని మోదీ వెల్లడించాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. 2020 మేకు ముందున్న పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. 65 పెట్రోలింగ్ పాయింట్ల (పీపీ)లో 26ను భారత్ కోల్పోయిందని తెలిపారు. 17 దఫాలు సైనిక చర్చల తర్వాత కూడా మోదీ ప్రభుత్వం ఈ సమస్యను ఎందుకని పరిష్కరించలేకపోయిందని ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో చైనాపై చర్చ అత్యవసరమని నొక్కిచెప్పారు. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని ఖేరా అన్నారు.

గడుసు పాత్రలకు కేరాఫ్ 'జమున'

హైదరాబాద్: అలనాటి నటి జమున శుక్రవారం కన్నుమూశారు. ఆమె పేరు చెప్పగానే సినీప్రియులందరికీ గుర్తొచ్చేది గడుసు పాత్రలే. అలాంటి పాత్రలకు జమున ప్రాణం పోశారు. అయితే ఆమె పేరు చెప్పగానే గుర్చొచ్చే మరో సినిమా కూడా ఉంది. అదే 'గుండమ్మ కథ' అంతలా ఆమెకు పేరు సంపాదించి పెట్టిందీ ఆ చిత్రం. వినసొంపైన మాటలు, పాటలు, పాత్రల చిత్రీకరణ, హావభావాలు గుర్తుకొస్తాయి. రామారావు, నాగేశ్వరరావు పాత్రల తీరు.. సావిత్రి సౌమ్యతనం, జమున కొంటెతనం, గుండక్క గయ్యాళితనం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. ఇటీవల ఆమె ఈ చిత్రం గురించి మాట్లాడుతూ 'గుండమ్మ కథ' చిత్రం పేరు పెట్టినప్పుడు పెద్దగా స్పందన రాలేదన్నారు. ఎన్టీఆర్, ఏఎన్నార్‌తో అప్పటికే అనుకున్న వివాదాన్ని ఆ చిత్రం కాంప్రమైజ్ చేసిందని గుర్త చేసుకున్నారు. ఆ ఇద్దరి హీరోలతో దాదాపు రెండేళ్లు మాట్లాడ లేదన్నారు. తనకున్న పొగరు కారణంగానే వాళ్లతో సినిమాలు చేయనని భీష్మించుకున్నానని తెలిపారు. ఆత్మాభిమానంతో ఉండాలనుకుంటే ఎవరితోనైనా గొడవలా స్తాయని ఆమె అన్నారు. నాగేశ్వరరావుతో వచ్చిన ఇబ్బంది కారణంగా ఆయన సినిమాలు చేయలేదనీ, ఏ రంగంలోనైనా ఆత్మాభిమానం పోగొట్టుకుంటే స్త్రీ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

దర్శక, నిర్మాతలు మూడేళ్లు ఎదురుచూపు

'గుండమ్మ కథ'లో సరో పాత్ర చేయాలని తన కోసం చక్రపాణి, నాగరెడ్డి మూడేళ్లు ఎదురు చూశారు. ఓ రోజు నాగేశ్వరరావు తను, నాగిరెడ్డి, చక్రపాణి సమవేశమయ్యామనీ, 'నా గుండమ్మ మూడేళ్లుగా ఏడుస్తోందయ్యా... సినిమా చేయడం' అని వారిద్దరూ నాగేశ్వరరావు చెప్పారని, ఆ చిత్రంలో తాను చిలిపి అమ్మాయిగా నటించి ప్రేక్షకులను అలరించానని ఆమె గుర్తు చేసుకున్నారు.

ఏడాది మాట్లాడుకోని సావిత్రి-జమున

"మిస్సమ్మ', 'దొంగరాముడు', 'అప్పు చేసి పప్పుకూడు' వంటి చిత్రాల కోసం తాను, సావిత్ర కలిసి అక్కా చెల్లెళ్లుగా నటించామని జమున తెలిపారు. దానివల్ల ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడిందనీ, దాంతో ఆమె నన్ను చెల్లి అని పిలుస్తుండేదన్నారు. తన పెళ్లికి ఆహ్వానిస్తే.. ఇంటికి వచ్చి నన్ను రెడీ చేసిందని గుర్తు చేసుకున్నారు. ఇంట్లో జరిగిన అనేక కార్యక్రమాల్లో సావిత్రి పాల్గొన్నది పేర్కొన్నారు. అయితే, ఓ సమయంలో కొంతమంది వ్యక్తులు తమ మధ్య తగువు పెట్టారనీ, దాంతో దాదాపు ఓ ఏడాదిపాటు ఇద్దరం మాట్లాడుకోలేదని తెలిపారు. తర్వాత వివాదాలు సమసిపోయి మళ్లీ కలిశామని, చివరిసారి చెన్నైలో ఆమె పరిస్థితి చూసి మనసు చలించిపోయిందని భావోద్వేగానికి గురయ్యారు.

నాలుగేళ్లపాటు బహిష్కరణ

ఒకానొక సందర్భంగా ఇండస్ట్రీకి చెందిన ఇద్దరు అగ్రనటులు తనపై నాలుగేళ్లపాటు బహిష్కరించారని ఆమె తెలిపారు. తన అలవాట్లు నచ్చకపోవడం వల్లే నిషేధం విధించారని అభిప్రాయపడ్డారు. దీనిపై తరచి చూడగా 'పొగరుబోతు' 'టైమ్‌కి రాదు' 'కాలం విలువ తెలియదు' లాంటి కారణాలు చెప్పారని, ఈ విషయం తెలుసుకున్న సినీ పెద్దలు రాజీ కూర్చి తామంతా మళ్లీ సినిమాల్లో కలిసి నటించేలా చేశారని వివరించారు. అలాగు 'శ్రీ కృష్ణ తులాభారం' చిత్రంలోని ఓ సన్నివేశంలో తాను ఎన్టీఆర్ తలపై తన్నానని అప్పట్లో కొంతమంది వివాదం సృష్టించారనీ, అది నిజంగా జరగలేదనీ, ఆ సినిమా షూటింగ్‌లో అనుకోకుండా తన కాలు ఎన్టీఆర్‌కు తగిలిందనీ, అప్పుడే ఆయనకు క్షమా పణలు చెప్పానని, ఆయన దేవుడిలా మన్నించారని జమున గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

సీఎంతో తీర రక్షక దళ కమాండర్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను తీర రక్షక దళ కమాండర్, అడిషనల్ డైరెక్టర్ జనరల్(ఏడీజీ) శివమణి పరమేష్ శుక్రవారం కలిశారు. తూర్పు సముద్ర తీరంలో సముద్ర భద్రతకు సంబంధించి తలెత్తుతున్న సవాళ్లను అధిగమించేందుకు భారత నావికాదళం చేపట్టిన వివిధ కార్యక్రమాలను సీఎం జగన్‌కు ఏడీజీ వివరించారు. సీఎంను కలిసిన వారిలో కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులు డీఐజీ యోగేందర్ ధాకా, కమాండెంట్ కె.మురళి, డిప్యూటీ కమాండెంట్ ఏబీ రాముమ్ పాల్గొన్నారు.

జమున మరణానికి సీఎం సంతాపం: సీనియర్ సినీనటి జమున మరణానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. తెలుగు చిత్ర పరిశ్రమ మొదటితరం నటీమణులలో అగ్ర కథానాయకిగా ఆమె వెలుగొందారని సీఎం ట్వీట్ చేశారు. తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్న జమున మృతి చెందడం బాధాకరమన్నారు. ఆమె మృతి తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు.

యు-19, టీ-20 ప్రపంచకప్

ఫైనల్‌కు దూసుకెళ్లిన టీమిండియా

ముంబై: తొలి మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో భారత అమ్మాయిలు సత్తా చాటారు. కీలకమైన సెమీస్‌లో న్యూజిలాండ్‌పై టీమిండియా ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొంది ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. జార్జియా ప్లిమ్మర్ (35), ఇసాబెల్లా (26) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. భారత బౌలర్లలో ప్రషవి చోప్రా 3 వికెట్లతో మెరవగా.. టిటాస్ సాధు, మన్నత్ కశ్యప్, షెఫాలీ వర్మ, అర్చనా దేవి తలో వికెట్ తీశారు. 108 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్.. 14.2 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. టీమిండియా బ్యాటర్లలో శ్వేత సెహ్రావత్ (61, 45 బంతుల్లో 10 ఫోర్లు) అర్ధ శతకం బాది భారత్ విజయంలో కీలకపాత్ర పోషించింది. సౌమ్య తివారీ (22) ఫర్వాలేదనిపించింది. కివీస్ బౌలర్లలో అన్నా బ్రౌనింగ్ రెండు వికెట్లు పడగొట్టింది. మూడు వికెట్లతో ఆకట్టుకున్న భారత బౌలర్ ప్రషవి చోప్రా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకుంది. ఫైనల్ మ్యాచ్ జనవరి 29న జరుగుతుంది.

సానియాకు నిరాశ

కెరీర్ చివరి గ్రాండ్‌స్లామ్‌లో ఓటమి: కన్నీళ్లతో ఆటకు వీడ్కోలు

వచ్చేనెల్లో దుబాయ్ ఓపెన్ చివరి టోర్నీ

మెల్‌బోర్న్: భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా తన గ్రాండ్‌స్లామ్ ప్రయాణాన్ని ఓటమితో ముగించింది. గ్రాండ్‌స్లామ్ కెరీర్‌లో చివరిదైన ఆస్ట్రేలియా ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫైనల్ వరకూ వెళ్లి పరాజయం పాలైంది. దీంతో తీవ్ర భావోద్వేగానికి గురైన సానియా, మ్యాచ్ అనంతరం తన జర్నీ గురించి మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకుంది. "నా ప్రొఫెషనల్ కెరీర్ మెల్‌బోర్న్‌లోనే మొదలైంది. నా గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను ముగించడానికి ఇంతకంటే మంచి వేదిక ఉంటుందని నేను అనుకోను. ఇది నాకు ఎంతో ప్రత్యేకం. నా కుమారుడు చూస్తుండగా గ్రాండ్‌స్లామ్ ఫైనల్ మ్యాచ్ ఆడతానని నేనెప్పుడూ ఊహించలేదు" అంటూ సానియా ఉద్వేగానికి గురైంది. ఈ వీడియోను ఆస్ట్రేలియా ఓపెన్ ట్విటర్ ఖాతాలో షేర్ చేస్తూ.. సానియాకు వీడ్కోలు పలికింది. 36 ఏళ్ల సానియా మీర్జా ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా ఓపెన్, దుబాయ్ ఓపెన్ తర్వాత ఆటకు వీడ్కోలు పలకనున్నట్టు వెల్లడించింది. ఇందులో తాజాగా జరుగుతున్న ఆస్ట్రేలియా ఓపెన్ తన చివరి గ్రాండ్‌స్లామ్. ఈ టోర్నీలో సానియా మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పోటీపడింది. మహిళల డబుల్స్ నిరాశపర్చినప్పటికీ.. మిక్స్‌డ్ డబుల్స్‌లో మరో భారత ఆటగాడు రోహన్ బోపన్నతో కలిసి ఫైనల్ వరకు దూసుకెళ్లింది. అయితే టైటిల్ పోరులో బ్రెజిల్ జంట స్టెఫానీ-రఫెల్‌లో చేతిలో 6-7, 2-6 తేడాతో సానియా-బోపన్న జోడీ ఓటమిపాలైంది. దీంతో సానియా.. గ్రాండ్‌స్లామ్ కెరీర్‌కు ఓటమితో వీడ్కోలు పలికినట్లయింది. ఇక, వచ్చే నెలలో జరిగే దుబాయ్ ఓపెన్‌లో సానియా తన కెరీర్‌లో చివరి టోర్నీ ఆడనుంది. టెన్నిస్‌లో సానియా మొత్తం 43 డబుల్స్ టైటిళ్లు సాధించింది. ఇందులో ఆరు గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలున్నాయి. మహిళల డబుల్స్ కేటగిరీలో 91 వారాల పాటు నంబర్-1 క్రీడాకారిణిగా నిలిచింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.